V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం
05-06-2024

సంపుటి : 01 | సంచిక : 32 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD




+91 90191 00099 | www.thevasavigroup.com | SCAN QR CODE TO DOWNLOAD BROCHURE | SALES OFFICE OPENS ON SUNDAY ALSO | Member of CREDAI HYDERABAD | NAREDCO TELANGANA

**Disclaimer:** This advertisement does not constitute an offer and / or acceptance and / or contract and / or agreement and / or transaction and/or any intention thereof and / or a disclosure under any statute of any nature whatsoever. The pictorial/other representation herein, the layout, number of buildings / towers / wings / structures, facilities and amenities are merely creative imagination and an Architect's impression and are only indicative. Actual product may vary / differ from what is indicated herein. The photograph contained herein may be stock/standard photography used for the purpose and have been taken at a location other than the project site and are used to indicate a conceptual lifestyle. **All norms, requirements pertaining to the environment, Fire Services, GHMC Rules and Regulations have been adhered to while designing the property.**




# ఫిఫ్టీ.. ఫిఫ్టీ..

## లోక్‌సభ ఫలితాల్లో కాంగ్రెస్, బీజేపీ హవా

- చెరో ఎనిమిది స్థానాల్లో గెలుపు
- ఎంఐఎం కంచుకోట స్థానం భద్రం
- ఒక్క స్థానంలో కూడా ఖాతా తెరవని గులాబీ పార్టీ
- 65.67 శాతం పోలింగ్ నమోదు
- పోటీపడ్డ 525 మంది అభ్యర్థులు
- రాష్ట్రంలో భారీ మెజార్టీ రఘువీర్ రెడ్డిదే
- మంత్రి పదవి రేసులో నలుగురు అభ్యర్థులు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పార్లమెంట్ ఎన్నిక ఫలితాల్లో అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీ మధ్య హవా నడిచింది. రాష్ట్రంలో మొత్తం 17 స్థానాలకుగానూ రెండు పార్టీలు చెరి సగం సీట్లు గెలుచుకున్నాయి. ఈ ఎన్నిక కౌంటింగ్ వేళ అత్యధిక సీట్లు గెలుచుకుంటుందోనని టెన్షన్ తలపించాయి. రాష్ట్రంలో అత్యధిక సీట్లు సాధించి మేమే పై చేయి సాధించామనే మాటే లేకుండా పోయింది. కాంగ్రెస్, బీజేపీ ఎనిమిది సీట్లను దక్కించుకున్నాయి. ఒక సీటును ఎంఐఎం పార్టీ దక్కించుకోగా.. బీఆర్ఎస్ పూర్తిగా నిరాశ పరిచింది. కేవలం ఒక్క స్థానాన్ని కూడా గులాబీ పార్టీ దక్కించుకోలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో డీలా పడిన ఆ పార్టీకి.. ఈ ఫలితాలు మరో ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సొంత చేసుకున్నారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గ స్థానాల కోసం 525 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. మే 13న పోలింగ్ జరగ్గా.. రాష్ట్రంలో 65.67 శాతం పోలింగ్ శాతం నమోదైంది. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమైంది. సాయంత్రంలోపు ఫలితాల్లో క్లారిటీ వచ్చింది.కాగా, నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి 5.59 లక్షల ఓట్ల మెజార్టీతో గెలవడం సంచలనంగా మారింది.

**మంత్రి పదవి ఆశలో నలుగురు!**

రాష్ట్రంలో గెలిచిన 8 మంది ఎంపీల్లో నలుగురు మంత్రి పదవుల రేసులో ఉన్నారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ ఎంపీలుగా గెలవటం ఇది రెండోసారి. ఈ ఇద్దరు మంత్రి పదవి రేసులో ఉన్నారు. తొలిసారి విజయం సాధించిన డీకే అరుణ, ఈటల రాజేందర్ కూడా మంత్రి పదవి కోసం పోటీ పడే ఛాన్స్ ఉంది. వీరిలో ఈటల, డీకే అరుణకు ఎక్కువగా ఛాన్సులు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం ఆ కూటమి అభ్యర్థులు మేజిక్ ఫిగర్ 272ను మించి 295 సీట్లతో సత్తా చాటారు. దీంతో ప్రధాని మోడీ మూడోసారి ప్రధానిగా పదవి చేపట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పదవుల పై ఆసక్తి నెలకొంది. ఎవరికి కేంద్ర మంత్రి యోగం దక్కనుందనేది రాష్ట్ర రాజకీయాల్లో సర్వత్ర ఆసక్తికరంగా మారింది.


కిషన్ రెడ్డి
సికింద్రాబాద్


బండి సంజయ్
కరీంనగర్ ఎంపీ


కె.రఘువీర్ రెడ్డి
నల్లగొండ


బలరాం నాయక్
మహబూబాబాద్


సురేష్ షెట్కార్
జహీరాబాద్


మల్లు రవి
నాగర్ కర్నూల్


డీకే అరుణ
మహబూబ్ నగర్


ఈటల
మల్కాజిగిరి


రఘునందన్ రావు
మెదక్


గడ్డం వంశీ కృష్ణ
పెద్దపల్లి


రఘురాం రెడ్డి
ఖమ్మం


ధర్మపురి అరవింద్
నిజామాబాద్


గోడెం నగేశ్
ఆదిలాబాద్


కిరణ్ కుమార్ రెడ్డి
భువనగిరి


కడియం కావ్య
వరంగల్


కె.విశ్వేశ్వర్ రెడ్డి
చేవెళ్ల


అసదుద్దీన్ ఒవైసీ
హైదరాబాద్

## వారణాసిలో మోడీ హ్యాట్రిక్

- మూడోసారి విజయం సాధించిన ప్రధాని
- కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌పై విజయం
- మోడీకి 612970, అజయ్ రాయ్‌కు 460457 ఓట్లు
- 152513 ఓట్ల తేడాతో నరేంద్రమోడీ గెలుపు
- గతంలో కంటే భారీగా తగ్గిన మెజారిటీ



**విశ్వంభర, వారణాసి:** ప్రధాని నరేంద్ర మోదీ వారణాసి లోక్‌సభ స్థానం నుంచి వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌పై ఆయన గెలుపొందారు. అయితే ఈసారి ఆయనకు మెజారిటీ భారీగా తగ్గింది. 152513 ఓట్ల తేడాతో తన సమీప ప్రత్యర్థి అయిన అజయ్ రాయ్‌ను ఓడించారు. మోడీకి 612970 ఓట్లు రాగా, అజయ్ రాయ్ 460457 ఓట్లు దక్కించుకున్నారు. బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి అథర్ జమాల్ లారీకి 33766 ఓట్లు వచ్చాయి. యుగ తులసి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన.. హైదరాబాద్‌కు చెందిన కొలిశెట్టి శివకుమార్ 5750 ఓట్లు పొందారు. గత రెండు ఎన్నికలతో మోదీ మెజారిటీ భారీగా తగ్గింది. 2019 ఎన్నికల్లో ఆయన 479,505 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో 371,784 ఓట్ల ఆధిక్యంతో ఆయన గెలిచారు. అయితే ఈసారి ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి చేదుఫలితం ఎదురైంది. గత ఎన్నికల్లో 62 సీట్లు సాధించిన కమలం పార్టీ ఈసారి 33 సీట్లకు పరిమితమైంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ మెజారిటీ కూడా తగ్గిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇక నా లక్ష్యం, కర్తవ్యాలు ఆ రెండే..

- కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం కొట్లాడతా..
- మోదీ నుంచి తెలంగాణకు నిధులు తెస్తా..
- ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్న
- ప్రజల విశ్వాసానికి తగ్గట్టు పని చేస్తా
- గెలిచిన అనంతరం ఈటల రాజేందర్



**విశ్వంభర, మల్కాజిగిరి:** తమకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్న. ప్రజల విశ్వాసానికి తగ్గట్టు తమ పని విధానం ఉంటుందని ఈటల రాజేందర్ చెప్పారు. ఈ గెలుపుతో తమకు రెండు కర్తవ్యాలు ఉంటాయని, వాటిలో ఒకటి తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం కొట్లాడతామని, రెండోది మోదీ ప్రభుత్వం నుంచి తెలంగాణకు నిధులు తెస్తామని అన్నారు. కీసర హోలిమేరి కాలేజీ వద్ద కౌంటింగ్ అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని చెప్పారు. ప్రజల ఆశీర్వాదం వల్ల గెలుస్తున్నామని ఈటల రాజేందర్ తెలిపారు. దేశంలో మూడోసారి మోదీ అధికారంలోకి రాబోతున్నారని చెప్పారు. మోదీ ఈ పదేళ్లలో పేదవారికి, ధనవంతులకు మధ్య ఉన్న అంతరాలను తగ్గించారని తెలిపారు. దేశంలో యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పించారని ఈటల చెప్పారు. మోదీ పాలనలో ఇప్పుడు దేశంలో బాంబుల మోతలు లేవని అన్నారు. కంటోన్మంట్ రోడ్లతో పాటు చెరువుల పునరుద్ధరణ, యువతకు ఉపాధి, పేదలకు ఇళ్లు అన్నీ నెరవేర్చుతానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.

## కూటమిని ఆశీర్వదించిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు: బాబు



**విశ్వంభర, మంగళగిరి :** టీడీపీ అధినేత, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి సందేశం పంపించారు. "ఏపీ గెలిచింది. ఏపీ ప్రజలు గెలిచారు. ఇవాళ నా హృదయం కృతజ్ఞతాభావంతో ఉప్పొంగుతోంది. ఓట్ల వెల్లువతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఆశీర్వదించిన మన రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాడి గెలిచాం. దెబ్బతిన్న రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేస్తాం. ఈ సందర్భంగా ఏపీ భవిష్యత్తుకు కట్టుబడి ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఏపీలో మా కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంలో జనసేనాని పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలను అభినందిస్తున్నాను. మా కూటమి కార్యకర్తలు, నేతల కఠోర శ్రమ, అంకితభావం ఫలితంగా ఈ చారిత్రాత్మక విజయం సాకారమైంది. చివరి ఓటు కూడా పడే వరకు వాళ్లు తెగించి పోరాడిన తీరు అద్భుతం. ఈ సందర్భంగా మా కూటమి నేతలకు, కార్యకర్తలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అంటూ చంద్రబాబు స్పందించారు.

**ఇది చెడుపై మంచి సాధించిన విజయం: నారా లోకేశ్**


ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తిరుగులేని విజయం సాధించడం పట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. ఈ విజయం ఎంతో ప్రత్యేకం అని అభివర్ణించారు. "ఈ విజయం... చెడుపై మంచి, అబద్ధాలపై నిజాలు, అధర్మంపై ధర్మం, దుర్మార్గంపై మంచితనం, అవినీతిపై నీతి, విధ్వంసంపై అభివృద్ధి సాధించిన విజయం. ఇది ఏపీ ప్రజలకు, అవినీతి పాలనతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన పాలకులకు మధ్య జరిగిన యుద్ధం. చివరికి మనమే గెలిచాం" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

## తండ్రిని మించిన నారా లోకేష్

**విశ్వంభర, మంగళగిరి:** గత ఎన్నికల్లో ఓటమి పాలైన నారా లోకేశ్ ఈసారి భారీ విజయం సాధించారు. తన తండ్రి చంద్రబాబు మెజార్టీని తలదన్నేలా.. ఏకంగా 90,160 మెజార్టీతో రికార్డు సృష్టించి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. చంద్రబాబు నాయుడుకి 47,340 ఓట్ల మెజార్టీ దక్కింది. కుప్పంలో 1989లో చంద్రబాబు తొలిసారి గెలిచినప్పుడు అత్యధికంగా 71,607 మెజార్టీ సాధించారు. ఆ తర్వాత నుంచి మెజార్టీ తగ్గుతూ వస్తోంది. 2009 నుంచి ఆయన మెజార్టీ 45వేల మార్కు దగ్గరే ఉంటోంది.



## విక్టరీ అని చెప్పి బోల్తాపడి.. కేటీఆర్ బాటలోనే జగన్




**విశ్వంభర, హైదరాబాద్:** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి దూసుకుపోతోంది. కూటమి అభ్యర్థులు ప్రభంజనం సృష్టిస్తున్నారు.అయితే ఎన్నికల కౌంటింగ్‌కు ముందు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ గన్ గురిపెట్టిన ఉన్న ఫొటోను ట్వీట్ చేశారు. 'హ్యాట్రిక్ లోడింగ్ 3.0' అని కేటీఆర్ ఎన్నికల ఫలితాల రోజు కౌంటింగ్‌కు ముందే ట్వీట్ చేశారు. అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కేటీఆర్ ఫలితాల తర్వాత అదే పోస్టును రీ ట్వీట్ చేస్తూ ఓటమిని అంగీకరించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి మంత్రి, సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్ అభినందనలు తెలిపారు. మీకు అంతా శుభం జరగాలని కోరుకుంటున్నానని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'తమకు రెండుసార్లు అవకాశం ఇచ్చిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోజు వచ్చిన ఫలితాలపై తాము బాధపడలేదని, కానీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యామని పేర్కొన్నారు. అయితే ఈ ఓటమిని నుంచి తాము నేర్చుకుంటామని, తిరిగి బలంగా పుంజుకుంటామని వ్యాఖ్యానించారు. హ్యాట్రిక్ సాధిస్తామన్న తమ గురి తప్పిందంటూ మరో ట్వీట్ చేశారు. దీనికి వయస్సు అయిపోదు.. గురి తప్పింది అంతే..' అని రాసుకొచ్చారు. కాగా, తాజాగా ఏపీ ఎన్నికల ఫలితాలపై సీఎం జగన్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. వైఎస్ జగన్ 2.0 లోడింగ్ పేరుతో బాణాన్ని వదులుతున్న జగన్ ఫొటోను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఎన్నికల ఫలితాల్లో వార్ వన్ సైడ్ అన్నట్లు మారడంతో ఇప్పుడు వైసీపీ నేతలకు నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో ఫలితాల కంటే ముందే ఇద్దరు విక్టరీ అని చెప్పి బోల్తా పడ్డారని కేటీఆర్, జగన్‌పై నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.

## ఆలూరులో రీకౌంటింగ్ జరపాలి

### టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్



**విశ్వంభర, ఆలూరు:** కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు గందరగోళంగా మారింది. రీకౌంటింగ్ జరపాలని టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ డిమాండ్ చేస్తున్నారు. 20 రౌండ్ల ఓట్ల లెక్కింపు అనంతరం వీరభద్ర గౌడ్ కు 92,178 ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి బి. విరూపాక్షి 2962 ఓట్ల మెజారిటీతో కొనసాగుతున్నారు. మరొక్క రౌండ్ లెక్కింపు మిగిలుంది. అయితే తనకు ఓట్లు తగ్గడంపై టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో... అనుమానం ఉన్న 5 రౌండ్ల వీవీ ప్యాట్లను అధికారులు లెక్కిస్తున్నారు. కాసేపట్లో ఆలూరు స్థానంలో ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది.

V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
05-06-2024
సంపుటి : 01 | సంచిక : 32 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా|| కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD

# చావుతప్పి కన్ను లొట్టబోయిన ఎన్డీఏ

## 291 స్థానాలతోనే సరిపెట్టుకున్న మోడీ ప్రభుత్వం



ఊహించని విధంగా ఇండియా కూటమికి 234 సీట్లు

బీజేపీని ఆదుకోని హిందీ రాష్ట్రాలు

చెయ్యిచ్చిన యూపీ, మహారాష్ట్ర

మ్యాజిక్ ఫిగర్ దాటినా సంతృప్తిలేని కమలం

కనీసం 300 మార్కునూ టచ్ చేయని ఎన్డీఏ

హస్తం పార్టీకి జోష్ ఇచ్చిన లోక్ సభ ఫలితాలు

09

### మూడోసారి వస్తున్నాం

#### ఇది భారతీయుల విజయం

- అద్భుతమైన తీర్పు ఇచ్చారు
- భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి ఆదర్శం
- ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీలో క్లీన్ స్వీప్
- తొలిసారి కేరళలో బీజేపీ సీటు గెలుచుకున్నాం
- అవినీతి లేకుండా పాలన అందిస్తాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

11



# ఫిఫ్టీ.. ఫిఫ్టీ..

## లోక్‌సభ ఫలితాల్లో కాంగ్రెస్, బీజేపీ హవా

చెరో ఎనిమిది స్థానాల్లో గెలుపు

ఎంఐఎం కంచుకోట స్థానం భద్రం

ఒక్క స్థానంలో కూడా ఖాతా తెరవని గులాబీ పార్టీ

65.67 శాతం పోలింగ్ నమోదు

పోటీపడ్డ 525 మంది అభ్యర్థులు

రాష్ట్రంలో భారీ మెజార్టీ రఘువీర్ రెడ్డిదే

మంత్రి పదవి రేసులో నలుగురు అభ్యర్థులు

2

ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ ఫలితాలు 2024

| | |
|---|---|
| టీడీపీ | 16 |
| జనసేన | 02 |
| బీజేపీ | 04 |
| వైఎస్ఆర్‌సీపీ | 03 |

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 2024

| | |
|---|---|
| టీడీపీ | 135 |
| జనసేన | 21 |
| బీజేపీ | 8 |
| వైఎస్ఆర్‌సీపీ | 11 |

# ఏపీలో చంద్రోదయం

## పవన్‌లో ప్రభంజనం సృష్టించిన చంద్రబాబు

- టీడీపీ చరిత్రలోనే భారీ విజయం
- 135 స్థానాల్లో సైకిల్ పార్టీ గెలుపు
- పోటీ చేసిన 21 స్థానాల్లోనూ గెలిచిన జనసేన
- 8 స్థానాల్లో వికసించిన కమలం పార్టీ
- 8 జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్
- 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వైఎస్ఆర్ సీపీ
- ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోనున్న వైఎస్ జగన్
- 22 ఎంపీ స్థానాల్లోనూ కూటమే గెలుపు



**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో కూటమి సునామీ సృష్టించింది. సైలెంట్ గా వచ్చిన ఈ వేవ్ వైసీపీని ముంచేసింది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ దాకా సైకిల్ పరుగులు పెట్టింది. ఆ దెబ్బకు ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయి. టీడీపీ చరిత్రలోనే ఇంత పెద్ద విజయం ఎప్పుడూ చూడలేదు. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచే కూటమి గెలుపు ఖాయం అయిపోయింది. మిగతా11లో...

# వైసీపీ ఘోర ఓటమి..

పార్టీ చరిత్రలోనే అతి తక్కువ సీట్లు

కేవలం 11 స్థానాల్లోనే గెలుపు

మంత్రులు, మాజీ మంత్రుల ఓటమి

కీలక నేతలు ఇంటిబాట..

ఎనిమిది జిల్లాలో ఖాతా తెరవని వైసీపీ

లోక్ సభ స్థానాల్లోను తీవ్ర పరాభవం

07

# ఓటమి నిరాశ కలిగించింది



- ఫినిక్స్ పక్షిలా పుంజుకుంటాం
- కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకుంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాభవాన్ని చవి చూసింది. రాష్ట్రంలో 17 స్థానాలకు ఒక స్థానంలో కూడా ఖాతాను తెరవలేకపోయింది. మొత్తంగా కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ నడిచింది. మిగతా11లో...

# గులాబీకి గుండు సున్న



లోక్‌సభ ఫలితాల్లో పూర్తి నిరాశ

రెండు స్థానాల్లో మాత్రమే సెకండ్ ప్లేస్

పార్టీ చరిత్రలో తొలిసారి పార్లమెంట్‌కు దూరం

ఆందోళనలో బీఆర్ఎస్ క్యాడర్

సవాల్‌గా లోకల్ బాడీ ఎలక్షన్స్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో లోక్‌సభ ఫలితాల్లో గులాబీ పార్టీ పూర్తిగా నిరాశ పర్చింది. 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ కనీసం ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, బీజేపీల మధ్య హవా నడిచింది. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మిగతా11లో...

### చతికిలపడ్డ రాజకీయ చాణక్యుడు

- కొత్త తరాన్ని పరిచయం చేయడంలో కేసీఆర్ విఫలం
- ఉద్యమంలో పోరాడిన వారిని మరవడమే ఇందుకు కారణమా..?
- లోక్ సభలో మూగబోయిన బీఆర్ఎస్ గొంతు



11



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 145 | ₹ 167 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹242 | ₹276 |

### కంటోన్మెంట్ కాంగ్రెస్‌దే

- ఉప ఎన్నిక దక్కించుకున్న హస్తం పార్టీ
- 13 వేల ఓట్లతో శ్రీ గణేష్ విజయం
- రెండో స్థానంలో నివేదిక.. మూడో స్థానంలో వంశా తిలక్
- 65 స్థానానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం
- 38కి చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



11

### పదవులు శాశ్వతం కాదు

- ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం
- ఐదేండ్లుగా పేదవాళ్లకు అండగా ఉన్నాం
- ఏం జరిగిందో అర్థం కావట్లేదు
- మేనిఫెస్టో హామీలు 99 శాతం పూర్తి
- కన్నీళ్లు ఆపుకుంటూ మాట్లాడిన సీఎం



10



11

### అభివృద్ధి పథం వైపు సాగుదాం

- రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగిద్దాం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- చంద్రబాబు, పవన్‌కు అభినందనలు

### సీఎం సొంత ఇలాకాలో బీజేపీ గెలుపు

- రేవంత్ రెడ్డి ప్రచారం చేసినా దక్కని ఫలితం
- ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి
- 3,410 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన డీకే అరుణ

11

విద్యాసంస్థలు ప్రారంభం కాకముందే

# ఫీజుల రెగ్యులేషన్ కమిటీలను నియమించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తూ.. ప్రజలను దోపిడీ చేస్తున్నారు. దీనిని అరికట్టడానికి ప్రైవేటు విద్యాసంస్థలకు సంబంధించిన ఫీజులను నియంత్రణ చేసే రెగ్యులేషన్ కమిటీలను నియమించి దోపిడీని అరికట్టాలని సమాచార హక్కు వికాస సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది.

ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజుల వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల ఏర్పాటు సమయంలో అనుమతి పొందే క్రమంలో ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాలను, నిబంధనలను తూచ తప్పకుండా పాటిస్తామని అర్హత గల వారితో మెరుగైన విద్యాబోధన చేయిస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని అనుమతులకు దరఖాస్తులు చేసుకుంటారు. అనుమతులు పొందిన క్షణం నుంచి విద్యాశాఖ ఆదేశాలను తుంగలో తొక్కి, నిబంధనలకు నీళ్లు వదిలి పక్కా వ్యాపారంగా దోచుకోవడానికి అనుమతులు ఇచ్చినట్టుగా విద్యాసంస్థలను అధిక లాభాలను ఆర్జించే వ్యాపారంగా నిర్వహిస్తున్నా వారు అధికంగా వున్నారు. సౌకర్యాల కల్పన విషయంలో నిర్లక్ష్యం, ప్రచారంలో ఆర్భాటం, ఆకర్షణీయమైన పేర్లతో స్కూల్‌లకు పేర్లు పెట్టడం, ఫీజుల వసూల్ల విషయంలో ఒకరిని మించి ఒకరు పోటీపడి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు.

సేవ పేరుతో అనుమతి పొందిన విద్యాసంస్థలు నిర్వహణకు అయ్యే ఖర్చులను జీతభత్యాలను లెక్కించి కేవలం 5% అదనంగా ఆదాయం వచ్చేటట్టు మాత్రమే ఫీజులు వసూలు చేయాలనే నిబంధన ఉన్నదనే విషయం పట్టించుకోవడం లేదు. దీనిని అనుసరించి ప్రతి ప్రైవేటు విద్యాసంస్థ ప్రతి సంవత్సరం ఆదాయ వ్యయంల రిపోర్టును విద్యాశాఖకు అందజేయాల్సి ఉన్నా ఆదేశాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పనిసరిగా వారు వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను తరగతుల వారీగా విడివిడిగా నోటీసు బోర్డు నందు వివరాలు ప్రదర్శించాలి. కానీ నోటీస్ బోర్డ్ లో వివరాలు పెట్టినవారు మచ్చుకైనా కనపడటం లేదు. ఈ విధంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు, అర్హత లేని వారితో విద్యాబోధన, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం జరుగుతున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. వీరిపై తల్లి తండ్రులు, విద్యార్థి సంఘాలు, ఎన్‌జీఓల సభ్యులు ఫిర్యాదు చేసినా.. వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు శూన్యం. పైగా ఫిర్యాదు చేసిన వారి సమాచారం, వివరాలు సంబంధిత విద్య సంస్థల యాజమాన్యానికి తెలియజేస్తుండడంతో ఫిర్యాదు దారులపై భౌతికంగా దాడులు జరుగుతున్నాయి.

ప్రతి కుటుంబం తమ పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించాలని తాపత్రయంతో ప్రైవేటు విద్యా సంస్థలు చేస్తున్న ప్రకటనలకు ప్రచారానికి ఆకర్షితులై ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులను చేర్పుతున్నారు. దీనిని అదునుగా చేసుకొని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వివిధ పేర్లతో ఫీజుల వసూళ్లు చేస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీతో సతమతమవుతున్న కుటుంబాలు అనేకం. ఈ విషయంపై పాలకులు, విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టి పాఠశాలలు ప్రారంభం కాకముందే అన్ని విద్యాసంస్థల్లో తరగతుల వారీగా వసూలు చేయు ఫీజులను నిర్ధారణ చేసి, ఆ ఫీజులే అమలయ్యేలా చూడడానికి ఫీజుల రెగ్యులేషన్ కమిటీలను త్వరగా నియమించాలని సమాచార హక్కు వికాస సమితి ప్రజల పక్షాన కోరుతుంది. అన్ని ప్రైవేటు విద్యాసంస్థలను తనిఖీ చేసి నిబంధనల మేరకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి. ఉల్లంఘించిన ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి, అవసరమైతే అనుమతులు రద్దు చేయాలని సమాచార హక్కు వికాస సమితి కోరుతుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు ఒత్తిడి లేని విధానాల్లో విద్యాబోధన జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ విద్యాశాఖది. దీని విషయంలో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.



- డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి,
ఎంఏ, ఎంసీజే, ఎల్ఎల్‌బీ
సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు
ఫోన్ : 99496 49766

# చతికిలపడ్డ రాజకీయ చాణక్యుడు

2023 ఎన్నికలు 2024 ఎన్నికలు ఏం జరిగింది. ఏం జరుగుతుంది. 2004 నుంచి నేటి వరకు లోక్ సభలో ప్రాతినిధ్యం వహించిన బీఆర్ఎస్ పార్టీ మొదటి సారిగా లోక్ సభలో ప్రాతినిధ్యం కోల్పోబోతున్నది. దీనికి కారణం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యంగా బీఆర్ఎస్ చీఫ్, ఉద్యమనాయకుడు ఆత్మపరిశీలన చేసుకోవాల్చిన అవసరం ఉంది.

కేసీఆర్ రాజకీయ చతురత, ఉద్యమం నడిపించిన తీరు చూస్తే రాజకీయ చాణక్యుడుగా పేరుగాంచాడు. ఉద్యమ సమయంలో ఉద్యమం నడిపించిన తీరు, తెలంగాణ సాధనలో ఎత్తులకు పైఎత్తులు వేసే బలమైన నాయకులుగా ఉన్న చంద్రబాబు నాయుడును, ఎదురులేని వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ఎదుర్కొన్న చరిత్ర కేసీఆర్‌ది.


2014 ముందు ఉద్యమ పార్టీగా, ఉద్యమ సారథిగా అందరి మన్ననలను అందుకున్న కేసీఆర్ సబ్బండవర్గాలను ఏకతాటిపైకి తీసుకురాగలిగారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకువచ్చిన క్రమంలో తెలంగాణ చర్చలేకుండా తెలంగాణ ప్రస్తావన చేయలేని అనివార్య పరిస్థితిని ప్రధాన పార్టీలకు పత్రికలకు, మీడియాకు కల్పించారు. తెలంగాణ అనే పదాన్ని అసెంబ్లీలో నిషేధించిన చంద్రబాబు చేతనే అనుకూల ప్రకటన చేయించిన ఘనత కేసీఆర్‌ది. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ దాకా తెలంగాణ ఉద్యమంలోకి అనివార్యంగా భాగస్వాముల్ని చేశాడు. ఉద్యమ ప్రస్థానంలో కవులు, కళాకారులు, ధూందాం పాటలు, విద్యార్థులు, ఉద్యోగులు, రాజీనామాలు, రాజకీయాలు ఎత్తులు పైఎత్తులు అన్ని సమపాళ్లలో జోడించి 2014 లో తెలంగాణ ఏర్పాటు వరకు కేసీఆర్ పాత్ర మరువలేనిది. ఇక 2014 లో తెలంగాణ ఏర్పాటు తర్వాత టీఆర్ఎస్ ఫక్తు రాజకీయ పార్టీ అంటూ అధికారం చేపట్టిన కేసీఆర్ కొత్త రాజకీయాన్ని చేయలేక పోయాడు. ఎన్టీ రామారావు ఏదైతే కొత్త రాజకీయాన్ని, కొత్త తరాన్ని పరిచయం చేయడంలో సఫలీకృతుడయ్యాడో అలాచేయడంలో కేసీఆర్ విఫలమయ్యాడు. ఎన్టీ రామారావులా ఒక కొత్త తరాన్నిపరిచయం చేసి నూతన ఒరవడిని సృష్టించే సదావకాశాన్ని కోల్పోయాడు.

అధికారం చేపట్టిన వెంటనే ఇతర పార్టీ నాయకులను చేర్చుకోవడంలో చూపిన శ్రద్ధ నూతన నాయకత్వం అందించడంలో విఫలమయ్యారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వాళ్లను తెలంగాణ కోసం పోరాడిన వారిని పక్కన పెట్టి పక్క పార్టీ నుంచి వచ్చిన తెలంగాణ ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేశాడు. ప్రతిపక్షాలు ఉండకూడదు అని ఉద్దేశంతో మొదటి దశలో 2014 నుంచి 2019 మధ్యకాలంలో బీజేపీ, వైసీపీ, టీడీపీ పార్టీలకు స్థానం లేకుండా చేశాడు. 2019 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన 21 స్థానాలకు గౌరవం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ, లెజిస్లేచర్ పార్టీనీ విలీనం చేసుకున్నాడు. తెలంగాణలో ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యమకారులు వ్యతిరేకమైనప్పటికీ గుర్తించకుండా నిరంకుశంగా వ్యవహరించడం తెలంగాణ సమాజం సహించలేకపోయింది. అందుకే 2023 ఎన్నికల్లో టీఆర్ఎస్ ని తెలంగాణ సమాజం ఓడించింది. ఆ ప్రస్థానం కొనసాగింపుగా ఈ లోగా వెలువడిన ఫలితాలు కేసీఆర్‌కు ఏ విధమైన సందేశాన్ని ఇస్తున్నాయి. నియంతగా వ్యవహరించి కుటుంబ పాలన సాగించి లోక్ సభలో ప్రాతినిధ్యం లేకుండా పోయిన కేసీఆర్ భవిష్యత్తులో ఏం చేయబోతున్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ ఉద్యమాన్ని తీసుకువెళ్లిన తీరు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. 2001 నుంచి 2014 వరకు ఉద్యమ ప్రస్థానం ఒకసారి అవలోకలం చేసుకుంటే కరీంనగర్ ఉప ఎన్నిక ద్వారా తెలంగాణ సమాజాన్ని ఒక తాటి మీదికి తీసుకురావడంలో సఫలమైన కేసీఆర్ నిరంతరం ఉద్యమాన్ని లైవ్‌లో ఉంచే ప్రయత్నం చేశాడు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న సందర్భంలో హింసాత్మకం వైపు వెళ్లకుండా తనే ఉద్యమ వేడిని తగ్గించి విమర్శలను కూడా ఎదుర్కొన్నాడు. ఒక సామెత చెప్పినట్టుగా "పాలు మరగనివ్వాలి పొంగనివ్వకూడదు, పాలు పొంగితే పొయ్యి ఆరిపోతుంది. పొయ్యి ఆరిపోవద్దు పాలు పొంగవద్దు అంటే పాలు పొంగకుండా కొన్ని నీళ్లు చల్లాలి" అనే పద్ధతిలో వెళ్లిన కేసీఆర్ ఉద్యమాన్ని సజీవంగా 13 సంవత్సరాలు ఉంచగలిగారు.

కేసీఆర్ ఓడిపోయి ఆరు నెలలు అయినప్పటికీ ఓటమి కారణాలను అన్వేషించే ప్రయత్నం చేయలేదు. తను ఏరి కోరి తెచ్చుకున్న నాయకులు ఒక్కొక్కరిగా నిష్క్రమించారు. అవసరాల కోసం వివిధ పార్టీల నుంచి వచ్చిన నాయకులు అవసరాలు తీరాక తిరిగి వారి వారి సొంత స్థావరాలకు వెళ్లిపోయారు. ఇప్పుడు కేసీఆర్ వెంట మిగిలింది ఎవరని చూస్తే సమాధానం లేదు. లోక్ సభలో బీఆర్ఎస్ గొంతు లేదు. ఇప్పటికైనా కేసీఆర్ నిజాన్ని గుర్తిస్తాడా.. బీఆర్ఎస్ ఓడిపోయింది కానీ తుడిచిపెట్టుకుపోలేదు. ఉద్యమకారులు, విద్యార్థులు, నిరుద్యోగులను చేరదీసే ప్రయత్నం చేస్తాడా.. తను ఎందుకు ఓడిపోయాడో తెలుసుకోకుండా ప్రాంతీయ పార్టీలు కుటుంబ పార్టీలు కంచిక చేరుతాయా అనేది కాలమే నిర్ణయిస్తుంది.




- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్ చైర్మన్,
సీఎండీ విశ్వంభర తెలుగు దిన పత్రిక



# ప్రజాగ్రహ సునామీలో కొట్టుకుపోయిన నియంత

## ప్రజా చైతన్యంతో.. జగన్ అరాచక పాలన అంతం

ప్రపంచంలో అరాచకత్వంతో పరిపాలన చేసిన ఏ నాయకుడు నిలబడలేదని.. ఆంధ్రప్రదేశ్ లో కూడా అదే జరిగిందని ప్రముఖ న్యాయవాది, ఏపీ పౌర హక్కుల సంఘం (ఏపీ సి ఎల్ ఏ) రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో ప్రజాస్వామ్యం బతికిందని... ఒక నియంత పాలన అంతమైందని ముప్పాళ్ళ సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా భయం గుప్పిట్లో బతికిన ప్రజలు వజ్రాయుధం లాంటి ఓటుతో ప్రతీకారం తీర్చుకున్నారన్నారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ హరించే విధంగా... విచారణ సంస్థలను చెప్పు చేతల్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన జగన్ సర్కార్ ను చైతన్యం కలిగిన ప్రజలే ఇంటి ముఖం పట్టించడం చారిత్రాత్మక విజయం అన్నారు. అభివృద్ధి ఆమడ దూరంలో అంధకారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కు చంద్రబాబే న్యాయం చేస్తారని ప్రజలు పూర్తిగా విశ్వసించారన్నారు. మూడు రాజధాని పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టిన జగన్ కు.. ఈ తీర్పు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకుండా నాటకాలు ఆడిన వైసీపీ ప్రభుత్వం.. అదే సమయంలో ల్యాండ్, సాండ్, లిక్కర్, మైనింగ్ మాఫియాలతో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా దోచుకున్నారని, రూల్ ఆఫ్ లా ఎక్కడ అమలు జరక్కుండా రాజ్యాంగానికి, చట్టాలకు అతీతులుగా రాజ్య హింసకు పాల్పడిన జగన్మోహన్ రెడ్డికి.. ఆయన చుట్టూ చేరిన భజన నాయకులకు ఈ ప్రజా తీర్పు జీవితంలో గుర్తుండిపోతుందన్నారు. ఒక దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబును పక్కనే కూర్చుండ పెట్టుకున్న సీఎం జగన్ కు..శిరోముండనం చేసిన తోట త్రిమూర్తులు వంటి నాయకులకు సీట్లు ఇచ్చిన జగన్ కు ప్రజలు ముఖ్యంగా ఎస్సీ ఎస్టీలు గూబ గుయ్యిమనేలా గుణపాఠం చెప్పారన్నారు. రాష్ట్రంలో వైసీపీ ఘోర పరాజయం.. నియంతృత్వానికి.. నిరంకు సత్వానికి చెంపపెట్టు అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు వచ్చిన ఫలితాలు... ప్రజల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవానికి సజీవ సాక్ష్యం అన్నారు. అప్రజాస్వామికంగా జగన్ సర్కార్ తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కూడా వైసీపీ పతనానికి నాంది పలికింది అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులను, ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను, ప్రజాస్వామ్య వాదులను, ప్రజలను అణచివేయాలని చూస్తే ఫలితాలు ఈ విధంగానే ఉంటాయని ముప్పాళ్ళ సుబ్బారావు హెచ్చరించారు.





- ముప్పాళ్ళ సుబ్బారావు
ప్రముఖ న్యాయవాది,
ఏపీ పౌర హక్కుల సంఘం

# నేతల రాత మార్చిన ఫలితాలు



**విశ్వంభర, హైదరాబాద్ :**

అధికారంలో ఉంటే అహం పెరుగుతుందనేది నానుడి. మరి ఈ నేతలకు ఏం ఊహించుకున్నారో తెలియదు కాదు.. ఎన్నికల ప్రచారంలో తమకు తామే వీరులం అన్నట్లు ఊగిపోయారు. ఒకరు నేను ప్రధాని అంటే.. ఇంకొకరు 400 సీట్లు పక్కా అన్నారు. మరొకరు వైనాట్ 175 అంటూ ఊహల్లో విహరించారు. తీరా మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఇద్దరు లీడర్ల బొక్కాబోర్లపడగా.. మరొకరు చావుతప్పి కన్ను లొట్టలోకి పోయింది. ఆ ముగ్గురు నేతలు ఎవరనేగా మీ డౌట్.. ఒకరు ప్రధాన మంత్రి మోడీ కాగా మరొకరు ఏపీ సీఎం జగన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్. ఎన్నికల ప్రచారంలో వీళ్ల ఊకదంపుడు ప్రసంగాలు ప్రజలు ఏమాత్రం పట్టించుకోలేదని రిజల్ట్‌లో స్పష్టంగా అర్థం అవుతోంది.

**వైనాట్ 175 సీట్స్ విషయంచూస్తే..**

ఎన్నికలకు చాలాకాలం ముందునుండే జగన్మోహన్ రెడ్డి వైనాట్ 175 అంటు పదేపదే చాలెంజులు చేశారు. కుప్పంలో చంద్రబాబునాయుడును ఓడించటం ఖాయమన్నారు. పార్టీ నేతలు, అభ్యర్థులతో సమావేశం, బహిరంగసభలు ఎక్కడ మాట్లాడినా జగన్ నినాదం ఒక్కటే వైనాట్ 175. ఫలితాల్లో చూస్తే ఏమైంది టీడీపీ కూటమి 163 సీట్లలో మెజారిటితో అఖండ విజయం దిశగా దూసుకుపోయింది. వైసీపీ పరిస్థితి ఏమిటంటే 12 సీట్లతో ముక్కి మూలుగుతోంది. 12 సీట్లంటే అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షపార్టీగా అర్హత కూడా కోల్పోయింది. ఫలితాల తర్వాత దేశమంతా ఏపీ వైపు నివ్వెరపోయి చూస్తుందన్న జగన్ మాటే నిజమైపోయింది. 175 సీట్లనూ వైసీపీనే క్లీన్ స్వీప్ చేస్తుందని జగన్ చెబితే చివరకు అసెంబ్లీలో గౌరవప్రదమైన హోదా కూడా దక్కలేదు.

**అసలు గెలిస్తే కదా..**

ఇక తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ వ్యవహారం చూస్తే జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ చక్రంతిప్పబోతోందని, ప్రధానమంత్రి రేసులో తాను కూడా ఉన్నానని పదేపదే చెప్పారు. ప్రధానమంత్రి రేసు కాదు కదా చివరకు తెలంగాణాలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలవలేదు. పదేళ్ళు అధికారంలో ఉన్నపార్టీ మొత్తం 17 సీట్లలో ఒక్కటంటే ఒక్క సీటులో కూడా గెలవలేకపోయింది. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ డబుల్ డిజిట్ స్థానాలు వస్తాయని జోరుగా ప్రచారం చేశారు. కానీ 17 స్థానాల్లో కేవలం రెండు స్థానాల్లోనే రెండో స్థానంలో నిలిచింది. మిగతా 15 స్థానాల్లో మూడు, నాలుగో స్థానాలకే పరిమితం అయింది.

**కమలం పార్టీకి ఊహించని షాక్**

400 సీట్లతో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని నరేంద్రమోడీ పదేపదే దేశమంతా ప్రచారం సమయంలో ఊదరగొట్టారు. ఎన్డీయేకి 400 సీట్లు వస్తాయి ఇందులో బీజేపీకే 370 సీట్లు ఖాయమన్నారు. తీరా ఫలితాలు చూస్తే ఏమైంది ? అతికష్టం మీద ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తోందని అర్థమవుతోంది. చివరి వార్తలు అందే సమయానికి ఎన్డీయే కూటమి 296 సీట్లలో మెజారిటిలో ఉంది. ఇందులో నుండి ఏవైనా రెండు గట్టి ప్రాంతీయపార్టీలు బయటకు వెళిపోతే ఎన్డీయే ప్రతిపక్షంలో కూర్చోవాల్సిందే. పై ముగ్గురి మాటల్లోను కామన్ పాయింట్ ఏమిటంటే గర్వం, అహంకారమే కనబడుతోంది. దేశంలో ప్రతిపక్షాలన్నవే లేకుండా చేయాలని మోడీ, తెలంగాణా, ఏపీలో ప్రతిపక్షాలు ఉండకూడదని కేసీఆర్, జగన్ గట్టిగా అనుకున్నారు. నిజానికి బలమైన ప్రతిపక్షం ఉన్నప్పుడే అధికారపార్టీకి విలువ పెరుగుతుందన్న విషయాన్ని వీళ్ళముగ్గురు మరచిపోయారు. ప్రతిపక్షాలన్నవే లేకపోతే ప్రజాస్వామ్యం స్థానంలో నియంతృత్వం చోటు చేసుకుంటుంది. ఈ విషయాన్ని మోడీ, కేసీఆర్, జగన్ మరచిపోయి ఓవర్ యాక్షన్ చేస్తున్నారని జనాలు అనుకోబట్టే ఓటు అనే ఆయుధంతో ముగ్గురికీ ఒకేసారి గట్టిగా బుద్ధిచెప్పారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ఈ విజయం మోడీకి అంకితం

- ఎంపీ అరవింద్

**విశ్వంభర, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో నా ఎన్నికలు ఈ పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క నిజామాబాద్ మోడీ కుటుంబ సభ్యుల విజయమని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం నిజామాబాద్ పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ హాల్ కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపున మొగ్గు చూపారని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ అభ్యర్థులు గెలిచారని అన్నారు. దేశంలో మూడోసారి ప్రధాన మంత్రిగా మోడీ ప్రమాణం స్వీకారం చేయబోతున్నారన్నారు. నా గెలుపు తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకునే సమయం వచ్చిందన్నారు. భారతదేశానికి అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్తామన్నారు. తన గెలుపు కోసం అహర్నిశలు చేసిన పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో రెండోసారి గెలిపించిన ప్రజల ఆశలను తప్పకుండా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

# గెలిచినా.. ఓడినా.. ప్రజల మధ్యనే ఉంటా

- తల్లి ఎంత ఇష్టమో.. నియోజకవర్గ ప్రజలంటే అంతే ఇష్టం
- బీఆర్ఎస్ శ్రేణులందరికీ కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు



**విశ్వంభర, ఖమ్మం జూన్ 4 :** తాను గెలిచినా.. ఓడినా నిత్యం నియోజకవర్గ ప్రజల మధ్యలోనే ఉంటానని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు కన్న తల్లి ఎంత ఇష్టమో.. నా నియోజకవర్గ ప్రజలు కూడా అంతే ఇష్టమని చెప్పారు. గెలిస్తే పొంగిపోయేది లేదు.. ఓడితే కుంగేది లేదన్నారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ప్రశ్నించే గొంతుకగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం.. సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని వెల్లడించారు. ఎంపీగా ప్రజా సేవే లక్ష్యంగా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా మచ్చ లేని వ్యక్తిత్వంతో ప్రజలకు సేవలు అందించానని గుర్తు చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



**విశ్వంభర, సంగారెడ్డి :** గత నెల 13న జరిగిన లోక్ సభ ఎన్నికలకు సంబంధించి, విజేతలను నిర్ణయించే కీలక ఘట్టం ఎన్నికల కౌంటింగ్ అని, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంభందించి 7-అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ గీతం యూనివర్సిటీ లో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కు ఎలాంటి అంతరాయం కలగకుండా, నియోజకవర్గాల వారిగా వేరు వేరుగా కౌంటర్లను, ప్రత్యేక బ్యారికెట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అల్లర్లకు, గొడవలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగిందని, ఈ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అందుకు సహకరించిన సంగారెడ్డి జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో చేజిక్కించుకున్న అనంతరం కరీంనగర్‌లోనొ తన నివాసంలో తల్లి శకుంతల ఆశీర్వదం తీసుకొంటున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్ – విశ్వంభర, కరీంనగర్

# చీకటి రోజులు పోయాయ్

- మెగా డీఎస్సీ బాధ్యత నాదే
- విజయంపై పవన్ కల్యాణ్
- 100 శాతం గెలిచామన్న జనసేనాని



**విశ్వంభర, మంగళగిరి :** ఏపీ రాజకీయాల్లో జనసేన సరికొత్త చరిత్ర సృష్టించింది. పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిచి దుమ్ములేపింది. 21 సీట్లలో అన్నింటా గెలిచి పవన్ ఇమేజ్ పవర్ ఏంటో చూపించింది. ఇక ఏపీలో కూటమి సునామీ సృష్టించింది. పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ క్రమంలోనే కూటమి విజయంపై పవన్ కల్యాణ్ మాట్లాడారు. మంగళగిరి పార్టీ ప్రధాన ఆఫీసులో ఆయన జనసేన నాయకులతో మాట్లాడారు. 'ఇది కక్ష్య సాధింపు విజయం కాదు..5 కోట్ల మంది ప్రజలకు చెబుతున్నా.. ఆ చీకటి రోజులు అయిపోయాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండవల్సిన సమయం వచ్చింది. అప్పట్లో సినిమాల్లో తొలిప్రేమతో విజయం సాధించాను. మళ్లీ ఇప్పుడు 21 సీట్లతో గెలిచే వరకు విజయం రుచిచూడలేదు. మన పార్టీ గెలిచింది కేవలం 21 స్థానాలే కావచ్చు. కానీ చాలా పెద్ద బాధ్యతను ఇచ్చారు. ప్రజలు కోరుకున్న ఏపీని తీర్చిదిద్దుతాం. ఇది కక్ష సాధింపు చర్యలకు సమయం కాదు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలి. వ్యవస్థల్లో రాజకీయ నేతల ప్రమేయం అతితక్కువ ఉండేలా చూసుకుంటాం.నేను 2019లో రెండు చోట్లా ఓడిపోయినప్పుడు ఎంత బాధ్యతతో ఉన్నానో ఇప్పుడు కూడా అంతే బాధ్యతతో ఉన్నాను. నాలో గెలపు అహంకారం అస్సలు లేదు. గెలిచాను అని తెలిసినప్పుడు భయపడ్డాను. ఎందుకంటే ఇల్లు అలకగానే పండగ కాదు. చాలా బాధ్యతతో పని చేయాలి. పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌ను మాత్రమే గెలిపించలేదు. 5 కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని గెలిపించారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ బాధ్యత నేనే తీసుకుంటాను. యువతకు చదువుకున్న చదువులకు తగ్గట్టు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత జనసేన తీసుకుంటుంది. ఏపీని అన్ని విషయాల్లో అగ్రగామిగా చూడాలన్నదే నా కల అంటూ పవన్ కల్యాణ్ చాలా ఎమోషనల్ గా మాట్లాడారు. భారత దేశంలో 100 శాతం కొట్టామంటే అది జనసేనదేనని అన్నారు. 21 స్థానాల్లో పోటీ చేసి 21 స్థానాల్లో గెలిచామన్నారు.



# జనసేన ఆఫీసుకు చంద్రబాబు

- పవన్‌ను అభినందించిన టీడీపీ చీఫ్
- జనసేనాని దంపతులకు సత్కారం
- బాబు కాళ్లు మొక్కిన అకీరా నందన్

**విశ్వంభర, మంగళగిరి :** టీడీపీ అధినేత చంద్రబాబు మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. పిఠాపురంలో విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్న జనసేనాని పవన్ కల్యాణ్ కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ ఈ ఎన్నికల్లో 21కి 21 అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు నెగ్గడం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబును పవన్, అన్నా లెజ్నెవా దంపతులు సత్కరించారు. ఈ సందర్భంగా పవన్ కుమారుడు అకీరా నందన్ చంద్రబాబు కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నా రు. ఇక, కుప్పంలో చంద్రబాబు 8వ సారి విజయం సాధించడం, ఏపీలో టీడీపీ సునామీ విజయాల పట్ల పవన్ కూడా హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. అనంతరం చంద్రబాబు, పవన్ కాసేపు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా జనసేన కార్యాలయం లో పవన్, లెజ్నెవాలతో పాటు అకీరా నందన్ కూడా ఉన్నాడు.

# ప్రతీ గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం..

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి
- షాద్‌నగర్‌లో బీజేపీ శ్రేణుల సంబురాలు



**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 4:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో డీకే అరుణ, దేశంలో ఎన్‌డీఏ గెలుపు సందర్భంగా బీజేపీ నాయకులు షాద్‌నగర్ పట్టణంలో విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. విజయోత్సవ సంబురాల్లో భాగంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అరుణ గెలుపు భాజపా కార్యకర్తల కష్టానికి ప్రతిఫలం అని అన్నారు. ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన స్వంత పార్లమెంట్‌లో గెలవాలని ఎన్నో కుయుక్తులు చేసినా ప్రజలు ఓటుతో తిప్పి కొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈటల రాజేందర్‌ను కలిసిన కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి



విశ్వంభర, ఎల్బీనగర్ : మల్కాజ్గిరి పార్లిమెంట్ ఎంపీగా ఈటల రాజేందర్ అత్యంత భారీ మెజారిటీతో గెలిచిన సందర్భంగా హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లిమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, జిల్లా ఏస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, సీనియర్ నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, గంగాని శ్రీను, జనార్దన్, వెంకట్ రెడ్డి, అరుణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన వారిపై కేసు

**విశ్వంభర, జగిత్యాల టౌన్ :** ఉపాధి నిమిత్తం విదేశాలకు పంపిస్తామని బాధితుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల టౌన్ సిఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం సారంగాపూర్ మండలానికి చెందిన కాముని గంగాధర్, జున్ను ప్రసాద్ లు విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ద్వారా ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని బాధితులకు ఆశ చూపారు. నెలకు సుమారు లక్ష రూపాయల జీతం ఉంటుందని చెప్పడంతో నమ్మిన 6 గురు బాధితులు ఒక్కొక్కరు 6 లక్షల రూపాయల చొప్పున 36 లక్షలు ముట్ట చెప్పారు. నెలలు గడిచిన ఇజ్రాయిల్ పంపించకపోవడం డబ్బులు అడిగితే ముఖం చాటేయడంతో మోసపోయమని గ్రహించిన బాధితుల్లో ఒకరైన రాఘవపట్నం కు చెందిన పూరెల్ల సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల్లో ఒకరైన కాముని గంగాధర్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు . మోసానికి పాల్పడ్డ మరొక వ్యక్తి జున్ను ప్రసాద్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.



# అత్యాచార కేసులో నిందితుడికి 10 ఏళ్ళు జైలు శిక్ష

**విశ్వంభర, ఆసిఫాబాద్ :** అత్యాచార కేసులో నిందితుడికి 10 ఏళ్ళు జైలు శిక్ష రూ. 6, 500 రూపాయల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ మంగళవారం తీర్పు ఇచ్చారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలం రోల్లప్పహాడ్ గ్రామానికి చెందిన రెబ్బన సుధాకర్ గోపాల్ నగర్ తాండూర్ మండలానికి చెందిన ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని రెబ్బెన సుధాకర్ ని అడగగా అతను నిరాకరించడంతో సదరు మహిళా 05.03.2020లో రెబ్బెన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా, నేరం రుజువు కావడంతో రెబ్బెన సుధాకర్ కు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 6,500 రూపాయలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత డీఎస్పీ సదయ్య,రెబ్బెన సీఐ, ఎస్ఐలను జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అభినందించారు.



# పోలీసుల సాక్షిగా అధికార పార్టీ ఎన్నికల నియమావళి ఉల్లంఘన

**విశ్వంభర, మందమర్రి :** భారతదేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మార్కెట్ లో బాణాసంచా పేల్చి సంబరాలు, సమావేశాలు నిర్వహించారు. ఒకవైపు ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నప్పటికీ అటుగా వచ్చిన పోలీసులు సైతం ప్రత్యేకంగా ఈ ఉదంతాన్ని చూసినప్పటికీ ముఖం చాటేయడం చర్చనీయాంశంగా మారింది. నియమావళి ఉల్లంఘన పై పోలీసులు, జిల్లా ఎన్నికల అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సిందే.

# ఇది ప్రజా విజయం

- విజయానికి సహకారించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు
- కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలను ప్రజలు తిప్పికొట్టి బీజేపీని బలపరిచారు
- మహిళా, యువ, దళిత, ఆయా మోర్చాల పాత్ర కీలకం
- విజయోత్సవ ర్యాలీలో కిషన్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 04 :** సికింద్రాబాద్ ఎంపీగా తనను గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కిషన్ రెడ్డి విజయం అనంతరం సికింద్రాబాద్ నియోజకవర్గంలో ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఎనిమిది స్థానాలను బీజేపీ సాధించడం పట్ల కిషన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయంలో బీజేపీ మహిళా మోర్చా, స్థానిక మహిళా కమిటీల పాత్ర కీలకమని కిషన్ రెడ్డి తెలిపారు. స్థానిక స్వయం సహాయక సంఘాలు, మహిళలకు పార్టీ గురించి తన గురించి వివరించి మంచి ఫలితాలను సాధించేలా కృషి చేసిన ప్రతీ ఒక్క అక్కాచెల్లెమ్మళ్లకు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. యువమోర్చా, ఓబీసీ, దళిత, ఇతర మోర్చాల కార్యకర్తలు కూడా తన విజయంలో కీలక పాత్ర పోషించారన్నారు. వీరితోపాటు ఆయా కుల, మత, వివిధ సంఘాల వారు తన విజయానికి తీవ్ర కృషి చేశారని వారందరికి పేరు పేరున కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలను ప్రజలు తిప్పికొట్టి బీజేపీని బలపరిచారని తెలిపారు. రెండో వారంలో నరేంద్ర మోదీ మరోమారు హ్యాట్రిక్ గా ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఏపీ గేమ్ ఛేంజర్ పవన్ కల్యాణ్

- జనసేనాని ఇమేజ్ కూటమికి ప్లస్
- బీజేపీని ఒప్పించడంలో కీలక పాత్ర
- ఓట్ షేర్ అయ్యేలా చేసిన పవర్ స్టార్



**విశ్వంభర, మంగళగిరి:** ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించింది అనే కంటే.. పవన్ కల్యాణ్ వల్లే సాధించింది అని చెప్పాలేమో. ఎందుకంటే దానికి బలమైన కారణాలు కూడా ఉన్నాయి. అందుకే కూటమి గెలిచినప్పటి నుంచి అందరూ పవన్ కల్యాణ్ ను గేమ్ ఛేంజర్ గా చెబుతున్నారు. వాస్తవానికి పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తులు పెట్టుకోక ముందు పరిస్థితి వేరే విధంగా ఉంది. టీడీపీకి ఏపీలో పెద్దగా మైలేజ్ లేదు. కానీ ఎప్పుడైతే పవన్ కల్యాణ్ వచ్చి టీడీపీతో పొత్తులు పెట్టుకున్నాడో.. అప్పుడే ఎల్లో పార్టీకి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. ఎందుకంటే క్లీన్ ఇమేజ్ ఉన్న పవన్ కల్యాణ్ కు ఏపీలో విపరీతమైన ఫాలోయంగ్ ఉంది.

సినీ గ్లామర్ తో పాటు.. ఐదేండ్లుగా పవన్ చేస్తున్న పోరాటం ప్రజల్లో బాగా మైలేజ్ ను పెంచింది. అయితే కరెక్ట్ సమయంలో చంద్రబాబు వ్యూహాత్మకంగా పవన్ తో పొత్తులు పెట్టుకున్నాడు. దాంతో పవన్ ఇమేజ్ కూటమికి ప్లస్ అయింది. దాంతో పాటు నరేంద్రమోదీ ఇమేజ్ కూడా కలిసి రావడానికి పవన్ కల్యాణ్ కారణం అయ్యారు. ఆయనే మధ్యవర్తిత్వం చేసి మరీ ఎన్డీయేలో టీడీపీని కలిపారు. దాంతో అటు కేంద్రం సపోర్ట్ దొరకడంతో పాటు మోడీ ఇమేజ్ కూడా తోడు అయింది. ఇక ఉత్తరాంధ్రలో కూటమికి భారీగా సీట్లు వచ్చాయి. అందుకు కారణం పవన్ కల్యాణ్.

కాపు సామాజిక వర్గం ఓట్లు కూటమికి పడ్డాయంటే పవన్ వల్లే. అంతే కాకుండా జనసేన కేవలం 21 సీట్లకే పరిమితం కావడం కూడా టీడీపీకి ఎక్కువ సీట్లను తెచ్చిపెట్టింది. ఒకవేళ జనసేన గనక ఎక్కువ సీట్లలో పోటీ చేసి ఉంటే కథ వేరేలా ఉండేదేమో. ఎందుకంటే పోటీ చేసిన 21 స్థానాల్లో, 2 ఎంపీ స్థానాల్లో జనసేన జెండా ఎగిరింది. వందశాతం స్ట్రైక్ రేట్ చూపించిన పార్టీ అది. అందుకే ఆ పార్టీ గనక ఈ ఎన్నికల్లో టీడీపీతో పొత్తులు పెట్టుకోకుండా పోటీ చేసి ఉంటే టీడీపీ గెలిచే అవకాశాలు లేవు. ఎందుకంటే జనసేనను ప్రజలు అంత బాగా ఆదరించారు. కాబట్టి జనసేన పొత్తులో భాగంగా తక్కువ సీట్లకు పరిమితం అయినప్పుడు జనసేన ఓటు బ్యాంకు టీడీపీకి ట్రాన్స్ ఫర్ అయ్యేలా చూశారు పవన్. అంతే కాకుండా వైసీపీ వ్యతిరేక ఓట్లు మొత్తం చీలకుండా పొత్తులు పెట్టుకోవడం వల్ల టీడీపీకి ఎక్కువ సీట్లు వచ్చాయి. దాంతో పాటు రాజధాని అంశం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మీద పవన్ చేసిన ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. వెరసి మొత్తంగా టీడీపీ కూటమి విజయం సాధించింది. అంటే ఈ మొత్తంలో పవన్ కల్యాణ్ దే కీలక రోల్ అన్నమాట.

# కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మలేదు

- రిజర్వేషన్ల ఫేక్ వీడియో కుట్రలను తిప్పికొట్టారు
- ఆరు నెలల్లోనే రేవంత్ ప్రభుత్వంపై విశ్వాసం పోయింది
- పార్లమెంట్ ఎన్నికలు రెఫరెడమ్ అన్న సీఎం ఇప్పుడు ఏమంటారు
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వాదించిన ప్రజలకు ధన్యవాదాలు
- తెలంగాణలో భవిష్యత్ భారతీయ జనతాపార్టీదే
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీజేపీ శాసనసభాపక్షనేత



**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 04:** తెలంగాణ ప్రజలే కాదు, యావత్ దేశ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని లోకసభ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బీజేపీ విజయం మోదీ విజయం, ఇది మోదీ సమర్ధ నాయకత్వానికి పడిన ఓట్లని తెలిపారు. తెలంగాణలో బీజేపీ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోందని 2014లో ఒక ఎంపీ సీటు, 2019లో నాలుగు సీట్లు, 2024 ఇపుడు 8 సీట్లు గెలిచామంటే ప్రధాని మోదీ చరిష్మా వల్లేనన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడినట్లు వీడియా మార్ఫింగ్ చేసిన కాంగ్రెస్ కుట్రలను ప్రజలు తిప్పికొడుతూ ఆ పార్టీకి బుద్ధిచెప్పారన్నారు. తెలంగాణలోనూ ఎన్ని జిమ్మిక్కులు చేసిన వారు చెప్పిన సీట్లు కంటే తక్కువే గెలిచారని తెలిపారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు రెఫరెడమ్ అని అన్నారు. 14 సీట్లలో గెలుస్తామని చెప్పారు. ఇప్పుడు 8 సీట్లకే వారిని ప్రజలు పరిమితం చేశారు. అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై ఆరు నెలల్లోనే ప్రజలకు విశ్వాసం పోయిందని తేలిందన్నారు. ఈ ఫలితాలు చూస్తే తెలంగాణలో కాంగ్రెసుకు కౌంట్ డౌన్ మొదలైందని స్పష్టమౌతోందని ఏలేటి తెలిపారు. ఇక గౌరవ ప్రధాని నరేంద్రమోడీని మూడో సారి ప్రధానిని చేయాలన్న ఆకాంక్షతో బీజేపీని ఆశీర్వాదించినందుకు ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 35శాతం ఓటు బ్యాంకు అందించిన రాష్ట్ర ప్రజలందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదలు తెలుపుతున్నామన్నారు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.



# నన్ను ఓడించాలని కుట్ర చేస్తే...
# కేసీఆర్ అడ్రస్ గల్లంతైంది

- కరీంనగర్ ప్రజలు దమ్మేందో చూపారు
- 6 గ్యారంటీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ అంతు చూస్తాం
- మోదీ హవాతోనే ఇంతటి మెజారిటీ దక్కింది
- కాంగ్రెస్ విష ప్రచారంతోనే దేశవ్యాప్తంగా బీజేపీ మెజారిటీ తగ్గింది
- ఎన్నికల ఫలితాల అనంతరం బండి సంజయ్ వ్యాఖ్యలు

**విశ్వంభర, కరీంనగర్ జూన్ 04 :** "బండి సంజయ్ గలీజోడు... ముస్లింలంతా ఏకమై ఆయనను ఓడించాలని కేసీఆర్ పిలుపునిచ్చిండు... ఏమైంది.. అందరూ ఏకమై నన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. కేసీఆర్ అడ్రస్సే గల్లంతు చేశారు" అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. తనను ఓడించేందుకు ఒక వర్గం ఓట్లను ఏకం చేయాలనుకున్న కేసీఆర్, కాంగ్రెస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి కరీంనగర్ ప్రజల దమ్ము చూపారని కొనియాడారు. కరీంనగర్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హవాతోనే తనకు ఇంతటి మెజారిటీ దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాడి ఆ పార్టీ అంతు చూస్తామని హెచ్చరించారు. కరీంనగర్ ప్రజలు తొలిసారి నన్ను 89 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపిస్తే ఈసారి అంతకంటే అత్యధిక భారీ మెజారిటీ ఇచ్చి నాపై నమ్మకం ఉంచి మరోసా మీకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు మీ అందరికీ శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. కరీంనగర్ సహా తెలంగాణ అభివృద్ధి చెందాలంటే మోదీ మరోసారి ప్రధాని కావాలనే లక్ష్యంతో నాకు భారీ మెజారిటీ అందించారు. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం గతంకంటే ఎక్కువ నిధులు తీసుకొస్తా. మరింత అభివృద్ధి చేసేందుకు క్రుషి చేస్తానని అన్నారు. కేసీఆర్ సైతం కరీంనగర్ కు వచ్చి ముస్లింలంతా ఒక్కటై బండి సంజయ్ ను ఓడించాలని పిలుపునిచ్చారు. చివరకు ఏమైంది? కేసీఆర్ అడ్రస్ గల్లంతు చేశారు. దయచేసి ముస్లిం వర్గం ఆలోచించాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మిమ్ముల్ని ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి. దయచేసి అన్ని వర్గాలను సమానంగా చూడాలన్నదే తన అభిమతం. నా వర్గాన్ని తక్కువ చేస్తే అంతు చూస్తాం... రాబోయే రోజుల్లో రాబోయేది మోదీ రాజ్యమే. రామరాజ్యమే.



## మా కుటుంబానికి ఇది గర్వించదగిన రోజు : రామ్ చరణ్

**విశ్వంభరచ హైదరాబాద్ :** గత ఎన్నికల్లో రెండు చోట్లా ఓడిపోయిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఈసారి ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీ సొంతం చేసుకోవడం పట్ల మెగా ఫ్యామిలీలో ఆనందం అంబరాన్నంటుతోంది. ఈ ఎన్నికల్లో పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన పవన్ కల్యాణ్ తన సమీప వైసీపీ ప్రత్యర్థి వంగా గీతపై 70,279 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో, పవన్ కు మెగా కుటుంబ సభ్యుల నుంచి విషెస్ వెల్లువెత్తు తున్నాయి. తాజాగా, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పవన్ విజయంపై స్పందించారు. "మా కుటుంబానికి ఇది గర్వించదగిన రోజు. మా పవన్ కల్యాణ్ గారికి శుభాభినందనలు. ఆయన విజయం తిరుగులేనిది" అంటూ రామ్ చరణ్ కొనియాడారు.



## 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశ్వంభర, నారాయణఖేడ్ జూన్ 4 : మెదక్ జిల్లాలో 108/102 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా 108/102 ప్రోగ్రాం ఆఫీసర్ జనార్ధన్ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే 108 సిబ్బంది స్పందించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఈఎంఈ అధికారి మహేష్, ఫైలెట్ రమేశ్, ఏఎంటీ సంగమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ, జనసేన పార్టీ నాయకుల విజయోత్సవాలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)/షాద్‌నగర్ జూన్ 04 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ కూటమి భారీ విజయం సాధించడంతో తెలంగాణలోని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు విజయోత్సవ సంబురాలు ఘనంగా చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బొబ్బల పద్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, దయానందం పాల్గొన్నారు.

### షాద్‌నగర్‌లో...

ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ మరియు కూటమి, పిఠాపురంలో జనసేన పార్టీ అధినేత భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా షాద్‌నగర్ జనసేన పార్టీ నాయకులు జరుపుల రాజు నాయక్, మహమ్మద్ అశ్రఫ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలో పటాకులు కాల్చి ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్‌ని భారీ మెజారిటీతో గెల్పించిన పిఠాపురం ప్రజల అందరికీ, టీడీపీ కూటమి గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు జరుపుల రాజు నాయక్, మహమ్మద్ అశ్రఫ్, పవన్ నాయక్, పార్థు, ఎం నాగరాజు, దాసరి శ్రీను, బిచ్చు నాయక్, జగన్ నాయక్, అరవింద్, శ్రీకాంత్, అంజి పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో ఘనంగా సంబురాలు

## కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయం

**విశ్వంభర, హైదరాబాద్/నారాయణఖేడ్ జూన్ 4 :** రాష్ట్రంలో కాంగ్రెస్ 8 పార్లమెంట్ నియోజకవర్గాల్లో, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం అసెంబ్లీ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో విజయం సాధించినందుకు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీ భవన్‌లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టపాకులు కాల్చి, డప్పు వాయిద్యాలు మోగించి.. మిఠాయిలు పంచి సంబురాలు నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్ యాదవ్, నాయకులు వీ హనుమంతరావ్, ప్రభుత్వ ప్రతినిధి హర్కర వేణుగోపాల్, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, మెట్టు సాయి, సంగిశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




### నారాయణఖేడ్ నియోజకవర్గంలో..

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా సురేశ్ షెట్కర్ గెలుపొందడంతో మంగళవారం పెద్ద శంకరంపేటలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో పెద్ద శంకరంపేటలో ర్యాలీ నిర్వహించి, టపాకులు కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాయిని మధుసూదన్, ఆర్ఎన్ సంతోష్ కుమార్, జనార్ధన్, రాజేందర్ గౌడ్, దానంపల్లి నారాగౌడ్, పేట మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, దాచా సంగమేశ్వర్, పెరుమాండ్లు, నర్సింలచారి పాల్గొన్నారు.

# సంక్షేమ పాలన అందిస్తాం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 04 :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ 100 రోజుల పాలనను ఆశీర్వదిస్తూ... ఎనిమిది లోక్ సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ శాసన సభ ఉప ఎన్నికలో విజయం చేకూర్చిన రాష్ట్ర ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు. మీరు అందించిన ఈ ఆశీర్వాదాలు మా ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. మరింత సమర్థవంతమైన పాలన అందివ్వడానికి ఉత్సాహాన్నిచ్చాయి. ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉన్నదన్న విషయాన్ని ఈ ఎన్నికల ఫలితాలు మరోసారి రుజువు చేశాయి. కాంగ్రెస్ విజయం కోసం పని చేసిన కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులందరికీ అభినందనలు, కృతజ్ఞతలు. ఇది కార్యకర్తల విజయం. వారి శ్రమ, కష్టం పార్టీ గుర్తిస్తుంది. రేపటితో ఎన్నికల కోడ్ ముగుస్తోంది. మళ్లీ ప్రజా ప్రభుత్వ పాలన మొదలవుతుంది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అద్భుతమైన పాలన అందిస్తాం. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ప్రజా పాలన ఉంటుంది. అందరికీ ధన్యవాదాలు అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలియజేశారు.

# ఇది మెదక్ ప్రజల విజయం..

- మోదీ నాయకత్వంలో పనిచేస్తాను
- ఎంపీ రఘునందన్ రావు



**విశ్వంభర, మెదక్ :** 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి రఘునందన్ రావు విజయం సాధించారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన పరిపాటి వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ నుంచి నీలం మధు ఓటమిపాలయ్యారు.లోక్‌సభ ఫలితాల అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు 10టీవీతో మాట్లాడుతూ.. ఇది మెదక్ ప్రజల విజయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పనిచేస్తానని చెప్పారు. డబ్బులతో ఏదైనా చేయొచ్చు అనే రాజకీయాలకు చరమగీతం పాడైనట్టయిందని అన్నారు. ఏడు నియోజకవర్గాల్లో వచ్చిన ఫలితాలను సమీక్ష చేసుకుని పార్టీని మెదక్ పార్లమెంట్‌లో అగ్రగామికి తీసుకెళ్తానని తెలిపారు. గొంతు లేని వారి పక్షాన గొంతునై నిలుస్తానని చెప్పారు. ఏడు నియోజకవర్గాల ప్రజలను కాపాడుకుంటానని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లేకపోతే ముఖ్యమంత్రి కారు పెట్రోల్‌కు పైసలల్లేవని రఘునందన్ రావు ఎద్దేవా చేశారు.తెలంగాణకు రావాల్సిన ప్రతి రూపాయిని బీజేపీ నేతలుగా మేం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఎన్డీఏగా పోటీ చేశాం.. ఎన్డీఏగానే కేంద్రంలో అధికారం చేపడుతామన్నారు. పూర్తి స్థాయి ఫలితాలు వెలుబడే నాటికి బీజేపీకి 20070 సీట్లు దాటుతాయని నమ్మకం ఉందన్నారు. రాహుల్ గాంధీ, ఖర్గే మాటలు వారి అహంకారిత పూరితానికి నిదర్శనమని రఘునందన్ రావు విమర్శించారు.

# ఘనంగా చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, చైతన్యపురి జూన్ 4 :** చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ నాయకులు, మిత్రులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డివిజన్ లోని ఆదర్శ ఫౌండేషన్ అనాధ పిల్లలకు, ప్రభాత్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో రోజు వారి వంట సామాన్లు, పండ్లు, బిస్కెట్స్ ఇచ్చి అక్కడే అనాధ పిల్లలతో కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. ఆ తరువాత భవానినగర్‌లో చంద్రశేఖర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి జీహెచ్ఎంసీ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ గుడి ధర్మకర్తలు కృష్ణ, శిల్ప, బీఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ మోహన్ రాజ్, యూత్ ప్రెసిడెంట్ జాన్ కిరణ్, ఎస్సీ నాయకులు పులి కిరణ్, శ్రీధర్, యూత్ వింగ్ సభ్యులు నరేష్, వెంకన్న, గణేష్, సాయి,స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు నవీన్, కళ్యాణ్, రాంబాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# చిలుకనగర్‌లో టీడీపీ సంబురాలు

**విశ్వంభర, ఉప్పల్ జూన్ 4 :** నియోజకవర్గంలోని చిలకానగర్ చౌరస్తాలో టీడీపీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. అంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లి ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో గుడపాటి ఫౌండేషన్ చైర్మన్ గూడపాటి శరత్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుడిపాటి శరత్ మాట్లడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధితోపాటు ప్రజల శ్రేయస్సు చుసే నాయకుడు కావాలని స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. అంధ్ర ప్రదేశ్ ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు శుభకాంక్షలు తెలిపారు. ఈ విజయంతో తెలంగాణలోను స్థానిక సంస్థల ఎన్నికలల్లో సత్తాచాటుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడపాటి ఫౌండేషన్ చైర్మన్ గుడపాటి శరత్, మల్కాజిగిరి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు సాయి నాగర్జున, నాయకులు హేమంత్ గౌడు, మౌలలి, శేకర్‌రెడ్డి, అశోక్, ఖాసీం, ఇమాంసాబ్, అవినాష్, ప్రకాష్, గాంధీ, కరుణ్, బబ్లు, ఇంతియాజ్ పాల్గొన్నారు.

# వైసీపీ ఘోర ఓటమి..

- పార్టీ చరిత్రలోనే తక్కువ సీట్లు
- కేవలం 11 సీట్లలోనే గెలుపు
- మంత్రులు, మాజీ మంత్రుల ఓటమి



ఏపీ రాజకీయ చరిత్రలో ఈ ఎన్నికల్లో వైసీపీకి పీడ కలలా మిగిలిపోతాయి. ఎందుకంటే ఆ పార్టీ అంత ఘోరంగా ఓటమి పాలైంది. గత ఎన్నికల్లో 151 సీట్లతో చరిత్ర సృష్టించి.. ఏపీలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన పార్టీగా రికార్డులకెక్కింది. కానీ ఇప్పుడు అంతకన్నా దారుణమైన రికార్డును మూటగట్టుకుంది. ఏపీ చరిత్రలోనే అతి తక్కువ సీట్లు సాధించిన అధికార పార్టీగా ముద్ర వేసుకుంది. ఈ ఓటమి మామూలు ఓటమి కాదు. ఎందుకంటే కనీసం ప్రతిపక్ష హెూదా కూడా వైసీపీకి దక్కలేదు. అంత ఘోరంగా ఓడించారు ఏపీ ప్రజలు.

### 11 సీట్లలోనే గెలుపు..

వైసీపీ పార్టీ 175 సీట్లలో పోటీ చేస్తే కేవలం 11 సీట్లలో మాత్రమే గెలిచింది. అది కూడా వైసీపీకి పట్టున్న రాయలసీమలోనే అంతో ఇంతో సీట్లు వచ్చాయి. అంతే తప్ప ఉత్తరాంధ్రలో అయితే ఖాతా కూడా తెరవలేదు. ఏకంగా 8 జిల్లాల్లో ఒక్క సీటు కూడా రాలేదంటే ఆ పార్టీ మీద ఎంత వ్యతిరేకత ఉందనేది అర్థం చేసుకోవచ్చు. ఈ ఓటమితో ఫ్యాన్ రెక్కలు పూర్తిగా విరిగిపోయాయి.

### మంత్రుల ఓటమి..

ఈ ఎన్నికల్లో ఒక్క పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తప్ప మిగతా మంత్రులందరూ ఓడిపోయారు. ఒక్కరు కూడా గెలవలేదు. దాంతో బూతుల మంత్రులకు ఓటర్లు చెంపదెబ్బ కొట్టారంటూ కామెంట్లు వస్తున్నాయి. కొడాలి నాని, రోజా, విడదల రజినీ, అమర్ నాథ్, అంబటి రాంబాబు, దాడిశెట్టి రాజా, బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్ తో సహా మిగతా వారంతా దారుణంగా ఓడిపోయారు. దాంతో వైసీపీకి బలమైన లీడర్ అసెంబ్లీలో లేకుండా పోయారు.

### ఎంపీ సీట్లలోనూ పరాభవం..

గత ఎన్నికల్లో వైసీపీకి 22 ఎంపీ సీట్లు వస్తే.. ఈ ఎన్నికల్లో ఆ నెంబర్ లో ఒక 2 మాత్రమే వచ్చింది. అంటే ఈ ఎన్నికల్లో 20 ఎంపీ సీట్లను కోల్పోయిందన్నమాట. ఈ సారి భారీగా ఎంపీ సీట్లు సాధించి కేంద్రంలో కీ రోల్ పోషించాలని జగన్ ఆశించారు. కానీ ఇంత దారుణమైన సీట్లు వస్తాయని ఆయన అనుకుని ఉండరేమో.



# 5 లక్షల ఓట్లు ఏమయ్యాయి? కేసులు పెడతా : కేఏ పాల్

**విశ్వంభర, హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల్లో విశాఖ పట్నం నుంచి, అసెంబ్లీ ఎన్నికల్లో గాజువాక నుంచి కుండ గుర్తుపై పోటీ చేసిన కేఏ పాల్‌కి షాక్ తగిలింది. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాలపై ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ రియాక్ట్ అయ్యారు. తన తండ్రితో పాటు 22 మంది కుటుంబ సభ్యులు ఓటేస్తే తనకు కేవలం 4 ఓట్లే పడ్డాయని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సీసీటీవీలను ఏర్పాటు చేయలేదని, తనకు వచ్చే 5 లక్షల ఓట్లు ఏమయ్యా యని, తన కుటుంబ సభ్యుల ఓట్లు ఎక్కడికెళ్లాయని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ ప్రశ్నించారు. ఈ దరిద్రపు ఎన్నికలు అక్కర్లేదని, తనకు 8 చోట్ల సున్నా ఓట్లు పడ్డాయని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కోర్టుకెళతానంటూ ఆయన మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఇదిలా ఉంటే ఏపీలో కూటమి లోక్సభ ,అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాన్ని నమోదు చేసింది. వైసిపి మాత్రం భారీ విజయాన్ని మూట కట్టుకుంది.



# నిరాశ చెందాల్సిన పని లేదు : హరీశ్ రావు

**విశ్వంభర, హైదరాబాద్ :** 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 17 లోక్ సభ స్థానాల్లో బరిలోకి దిగిన బీఆర్ఎస్..కనీసం ఒక్క చోటు గెలవకుండా ఎన్నికల పోరులో పూర్తిగా చేతులేత్తిసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 10 సంవత్సరాల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది.అసెంబ్లీ ఎన్నికల్లోనైనా 38 సీట్లు సాధించి ప్రతిపక్ష హెూదా దక్కించుకున్న బీఆర్ఎస్.. లోక్ సభ ఎన్నికల్లో ఒక్కస్థానంలో కూడా ఖాతా తెరవకుండా మూడవ స్థానంలో నిలిచింది. టిఆర్ఎస్ పార్టీ పోటీ చేసిన అన్ని పార్లమెంట్ స్థానాల్లో మూడో స్థానంలోనే నిలవడం గమనార్హం. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఓటమిపై మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. 24ఏళ్ల చరిత్రలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నో ఒడిదుడుకులను చూసింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడింది. ఎంపీ ఎన్నికల ఫలితాలతో నిరాశ చెందాల్సిన పని లేదు. లక్షల మంది కార్యకర్తల ఆశీస్సులు, అభిమానంతో తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధాన ప్రతిపక్ష పార్టీ



నిజామాబాద్ పార్లమెంటరీ ఎన్నికల్లో ఎంపీగా రెండవసారి 1,22,711 ఓట్ల భారీ మెజారిటీతో విజయదుందుభి మోగించిన బీజేపీ నాయకుడు ధర్మపురి అరవింద్‌ను మెట్పల్లి బీజేపీ నాయకులు డాక్టర్ రఘు, నిజాంబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ సదాశివ్, భోగ దత్తత్రి, ఉమేష్, రమేశ్ కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు.

– విశ్వంభర, మెట్పల్లి

# అమ్మ ఆదర్శ పాఠశాలలో మరమ్మతుల పరిశీలన

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) జూన్ 04 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రాయిపల్లి గ్రామ పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలను నీడ్స్ మంచి పరిసరాలు విద్య అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కానుగంటి శ్రీశైలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలను మూత్రశాలలు ఆట స్థలాన్ని తాగునీటి సదుపాయాన్ని కరెంట్ ఫిట్టింగ్ పనులు దగ్గరుండి చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరే రమేష్, యశ్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







# బీఆర్ఎస్ ఈ ఎన్నికలతో పూర్తిగా పతనం

**ఎమ్మెల్యే మందుల సామేలు**



**విశ్వంభర, తుంగతుర్తి:** తన నియోజకవర్గమైన తుంగతుర్తితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా బొంద పెట్టామని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో చావుకు దగ్గరైన ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి పూర్తిగా చచ్చిపోయిందని అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లు ఏ స్థాయిలో విర్రవీగిందో..? అంతకంటే స్పీడ్ గా ఆ పార్టీ పతనమైందని, దీనికి ఆ పార్టీ పెద్దల నిరంకుశ పాలనేనని ఆయన దుయ్యబట్టారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డికి ఆయన శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 9 సీట్లు వస్తే ఈ ఎన్నికల్లో మాత్రం ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పతన మైందని అన్నారు. శాసనసభ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజార్టీ ప్రకారమే పార్లమెంట్ ఎన్నికలకు వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలన్నీ చారిత్రాత్మకంగా చరిత్రలో నిలిచిపోతాయని స్పష్టం చేశారు.ఎన్నికల సీజన్ పూర్తయింది.. ఇక నియోజకవర్గంలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై దృష్టిని కేంద్రీకరిస్తానని సామెల్ స్పష్టం చేశారు. జిల్లా మంత్రులు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారం తో నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు తీసుకొస్తానని పేర్కొన్నారు.

## మల్లు రవికి శుభాకాంక్షల వెల్లువ



**విశ్వంభర, కడ్తాల్:** నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన డాక్టర్ మల్లు రవి కి కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లు రవి తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి భారత్ ప్రసాద్ పై 79 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపొందడం హర్షదాయకమని ఆనందం వ్యక్తం చేశారు. పిసిసి కార్యవర్గ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ, డిసీసీ అధికార ప్రతినిది, కడ్తాల్ ఎంపిటిసి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యనాయక్, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, కో-ఆప్షన్ సభ్యుడు జాంగీర్‌బాబ మల్లు రవి ని కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

## డీకే అరుణ గెలుపు పాలమూరు అభివృద్ధికి మలుపు

- మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ కూటమి విజయం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి



**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 4 :** పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు స్థానాన్ని కైవశం చేసుకు న్న డీకే అరుణకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీకే అరుణ క్రమ శిక్షణ నిబద్ధతతో పని చేస్తూ.. నిత్యం పాలమూరు జిల్లా కార్యకర్తలకు అండగా ఉంటున్నారని కొనియాడారు. ముఖ్య మంత్రి సొంత జిల్లాలో బీజేపీ విజయం కార్యకర్తలు, నాయకులు సమిష్టి వల్లనే సాధ్యమైందన్నారు. దేశంలో మళ్లీ మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాదించిందన్నారు. రామరాజ్యం కావాలని పాలమూరు ప్రజలు డీకే అరుణకు అండగా ఉన్నారన్నారు. డీకే అరుణ 2019 నుంచి కార్యకర్తలకు అండగా ఉంటూ, పార్టీ కోసం క్రమశిక్షణ నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. పాలమూరులో డీకే అరుణ గెలుపుతో జిల్లాకు ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## భవాని మాతకు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 4 :** ఎలికట్ట భవాని మాత అమ్మవారి దేవాలయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో ఉన్న శ్రీ భవాని మాత ఆలయంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతోకలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లు, తనకు ఓటు వేసి గెలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల బలోపేతానికి తన వంతు కృషి చేయనున్నట్లు వివరించారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం పెట్టి ఓట్లు వేసి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెంది శ్రీనివాస్ రెడ్డి, కడంపల్లి శ్రీనివాస్ గౌడ్, శివా చారి తోపాటు బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు ఉన్నారు.



## ప్రమాదవశాత్తు తాటి వనం దగ్ధం

- భీమవరంలో సంఘటన

**విశ్వంభర, మేడిపల్లి :** జగిత్యాల జిల్లాలోని భీమరం మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి దగ్గర ఉన్న 8 ఎకరాల తాటివ్వనానికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని తాటి వనం దగ్ధమైంది. ఇందులో సుమారు 500చెట్లకు పైగా అగ్నికి ఆహుతి అయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. ప్రభుత్వం గీత కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నారు.



## షాద్‌నగర్‌లో టీడీపీ శ్రేణుల సంబురాలు

**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 4:** షాద్‌నగర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తల సంబురాలు అంబరాన్నంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం తెలుగుదేశం కూటమి అఖండ విజయం సాధించిన సందర్భంగా షాద్‌నగర్ టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ చల్ల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, అభిమానులు షాద్‌నగర్ చౌరస్తాలో టపాకులు కాల్చి ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటయ్య, ఆనంద్, రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుతో మేకల కాపరి మృతి

**విశ్వంభర, నారాయణఖేడ్ జూన్ 4:** పెద్ద శంకర పేట మండల పరిధిలోని బూరుగుపల్లి చందా నాయక్ తండాకు చెందిన ముడావత్ జైపాల్ (25) మేకల కాపరి. జైపాల్ మంగళవారం మేకలను మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో జైపాల్ తోపాటు మూడు మేకలు మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. చందానాయక్ తాండకు చెందిన జైపాల్ మేకలను కాస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా మృతుడు ముడావత్ జయపాల్ భార్య ప్రస్తుతం గర్భవతి. జైపాల్ పిడుగుపాటుకు మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



## యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు గర్భాలయ ప్రవేశం

**విశ్వంభర, యాదగిరిగుట్ట :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు గర్భాలయ ప్రవేశం మంగళవారం నుంచి ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విజ్ఞప్తి మేరకు ప్రతి మంగళవారం స్థానిక యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు స్వామివారి గర్భ ఆలయ ప్రవేశాన్ని ప్రతి మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి 5:30 వరకు ఉంటుంది. స్థానికులు యాదగిరి గుట్టలో ఉంటున్న ఐడి ప్రూఫ్ చూపిస్తే అంతారాలయం దర్శనముకు అనుమతిస్తారు. అలాగే సాంప్రదాయ దుస్తులతో వచ్చిన భక్తులకే ఈ ప్రవేశం ఉంటుంది. దీంతో యాదగిరిగుట్ట పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఉపాధి కూలీలకు అవగాహన సదస్సు

**విశ్వంభర, జగిత్యాల జూన్ 4:** జిల్లాలోని గొల్లపల్లి మండలం వెలుగుమట్ల గ్రామంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి బీ వాణిశ్రీ ఆదేశాల మేరకు తేజస్ ఫౌండేషన్ సఖి కేంద్రం సంయుక్త ప్రతినిధి అనురాధ గ్రామంలోని ఉపాధి హామీ కూలీలు, యువతీయువకులు, విద్యార్థులకు నేటి సమాజంలో జరుగుతున్న నేరాలపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను, కుటుంబంలో కలహాలు, యువకులు మత్తులో చేస్తున్న నేరాల గురించి వివరించి వాటిని ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువతులు మోసపోతున్న తీరును వివరించారు. చిల్డ్రన్ గైడెన్స్ వివిధ అంశాలపై మరియు ప్రభుత్వ సేవలను ప్రజలు ఏ విధంగా వినియోగించుకోవాలో సూచించారు. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం చేస్తున్న అవగాహనా కార్యక్రమాన్ని ఎప్పటి కప్పుడు తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రమోద్ గౌడ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



## ఉప్పల సాలయ్య కుటుంబానికి పరామర్శ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) జూన్ 04 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరేళ్ళ గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు తండ్రి తెలంగాణ భూ పోరాట ఉద్యమకారుడు ఉప్పల సాలయ్య(95) సోమవారం తుది శ్వాస విడిచారు. మంగళవారం సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మృతుడు ఉప్పల సాలయ్యకు నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాలయ్య కుమారులు ఉప్పల ముత్యాలుకి వారి కుటుంబ సభ్యులకి మనోధైర్యాన్ని కల్పించారు. తెలంగాణ భూ పోరాటంలో సీపీఐ పార్టీకి సాలయ్య సహకారం అందించారని వారు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోధర్ రెడ్డి, బోలగొని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చెడచంద్రయ్య, ఏషాల అశోక్, కల్లెం కృష్ణ, పాసికంటి లక్ష్మీనరసయ్య, సీపీఐ మండల కార్యదర్శిలు జల్ది రాములు, అన్నపు వెంకటేష్, అన్నేమైన వెంకటేష్, మారుపాక వెంకటేష్, బబ్బూరి శ్రీధర్, సాలిగంజి వీరాస్వామి, ఎల్లంకి మహేష్, పుట్ట రమేష్, ఉప్పుల శాంతి కుమార్, గుర్రం రాజమణి, సూరారం జానీ, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.

## ప్రజాతీర్పును గౌరవిస్తున్న

- మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి



**విశ్వంభర, మేడ్చల్ :** మల్కాజ్ గిరి లోక్ సభ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో తన ఓటమిని మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నట్లు ఆమె ఓ ప్రకటనలో వెల్లడించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి కృంగిపోకుండా ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనకు ఓటు వేసిన మల్కాజిగిరి ఓటరు దేవుళ్ళందరికీ పట్నం సునీతమ్మ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన శ్రీగణేష్ కు, ఎంపీగా గెలిచిన ఈటల రాజేందరకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

## లారీ ఢీకొని యువకుడు మృతి

**విశ్వంభర, గొల్లపల్లి :** లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే బోయినపల్లి మండలం మర్లపేట గ్రా మానికి చెందిన సాయి కృష్ణ తన మోటార్ బైక్ మీద అత్త గారిల్లు అయిన గొల్లపల్లికి వచ్చే క్రమంలో మండల కేంద్రంలో కి రాగానే కారును ఓవర్ టేక్ చేస్తుండగా.. ఎదురుగా వస్తున్న పెట్రోల్ లారీ ఢీ కొట్ట డంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం జరగడం తో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన ఘటన చూసిన స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

## రాశి ఫలాలు



– మాధవశేషు స్వామి, వాస్తు, జ్యోతిష్యం పురోహిత్, సెల్: 9059308808

**26-05-2024 నుండి 05-06-2024 వరకు**



**మేష రాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడలేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకు కల్గించును. నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.



**వృషభ రాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసటగా ఉండును. కుటుంబ విషయాలలో ఆర్థికంగా ఆలోచించి ముందుకు సాగుతారు. పుత్రా సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం ఇతరులకు డబ్బు ఇవ్వరాదు. ఇచ్చినచో తిరిగిరావు.



**మిథున :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారం ప్రారంభానికి ఆలోచిస్తారు. భార్య ఆరోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన విలువైన కాగితాలు, డబ్బులు మరచిపోగలరు. బంధు వర్గం వారితో జాగ్రత్త అవసరం. విరోధాలు ఉండును.



**కర్కాటక :** విశేష యోగవంతంగా ఉంది. తలచిన వెంటనే పనులు పూర్తగును. విదేశీ ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగవంతంగా ఉండును. స్వంత ఆలోచనతో వ్యాపారం చేయుట మంచిది. శుభ వార్తలు వింటారు.



**సింహరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడును. అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడిననూ వారం చివరిలో శుభం కల్గును.



**కన్యారాశి :** అనుకూలంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. నిరుద్యోగులకు ఉద్యోగం ప్రాప్తించును. పుత్ర సంతానంతో ఆనందంగా కాలక్షేపం చేస్తారు. డబ్బు ఖర్చు అధికంగా ఉండును.



**తులరాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరం. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని కలిగి ఉందురు. సంతానం ద్వారా ధన నష్టం కల్గును. ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉండును.




**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్ననూ, అనుకున్న కోర్కెలు నెరవేరును. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు మేరుగుపడును. శారీరక శ్రమ అధికం కావటం వల్ల శిరో బాధలు ఏర్పడును.



**ధనుస్సురాశి :** గడ్డుకాలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి మూడు సార్లు తిరగవలసి వస్తుంది. వాహనం నడపడంలో జాగ్రత్త అవసరం.



**మకరరాశి :** శ్రమకు తగిన ఫలితాన్ని సాధిస్తారు. స్నేహితులతో విరోధాలు, అకాల భోజనం, సోదర విరోధం, మాట విలువ తగ్గును. ఆర్థిక విషయాలు చికాకు కలిగిస్తాయి. కోర్టు వివాదం ఒక కొలిక్కి వస్తుంది.



**కుంభరాశి :** రాజయోగంగా ఉన్నది. వ్యాపారాభివృద్ధి చెందుతారు. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయల్లో జాగ్రత్త అవసరం. కొంత చికాకుగా ఉన్ననూ వారం చివరి వరకు అన్ని పనులు పూర్తి అగును. సోదర, బంధు వర్గం వారికి విశేష సహకారం అందించగలరు.



**మీనరాశి :** విశేషంగా ఉన్నదని చెప్పొచ్చు. కార్య దీక్షతో అన్ని పనులు పూర్తి చేస్తారు. ద్రవ్యం నిల్వ చేస్తారు. స్నేహితులతో విహారయాత్రలు చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.

### వయనాడ్, రాయ్‌బరేలీలో
# రాహుల్ విజయం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కొత్త సమస్య వచ్చి పడింది. రెండు స్థానాల్లోనూ ఇప్పుడు భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఏ స్థానాన్ని ఉంచుకోవాలి, ఏ స్థానాన్ని వదులుకోవాలి అనే సందిగ్ధంలో రాహుల్ పడ్డారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ, కేరళలోని వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేయగా.. అమేథీలో ఓటమి పాలయ్యారు. దీంతో వయనాడ్‌లో గెలవడంతో ఎంపీగా కొనసాగారు. అయితే ఈసారి అలాంటి పరిస్థితి కాకుండా రెండు స్థానాల్లో విజయం దక్కింది. దీంతో కొత్త చిక్కు వచ్చి పడింది. రాయ్‌బరేలీ స్థానాన్ని వదులుకుందాం అంటే.. అది కాంగ్రెస్ పార్టీకి కొన్నేళ్లుగా కంచుకోటలా ఉంది. అంతేకాకుండా తన తల్లి సోనియా గాంధీ వరుసగా గెలుస్తున్న సీటు కాబట్టి కొంత సెంటిమెంట్ కూడా ఉంటుంది. అదే సమయంలో వయనాడ్ నియోజకవర్గాన్ని వదులుకుందామనుకుంటే.. 2019 లో అమేథీలో ఓడిపోయినా.. వయనాడ్ ఓటర్లు రాహుల్ గాంధీని భారీ మెజార్టీతో లోక్‌సభకు పంపించారు. దీంతో వయనాడ్, రాయ్‌బరేలీ 2 స్థానాలు ఇప్పుడు రాహుల్ గాంధీకి ఎంతో కీలకంగా మారాయి. ప్రస్తుత ఎన్నికల్లో రాయ్‌బరేలీలో బీజేపీ నేత దినేశ్ ప్రతాప్ సింగ్‌పై 3.88 లక్షల ఓట్ల మెజార్టీతో రాహుల్ గెలిచారు. 2019 లో ఇదే స్థానంలో సోనియా గాంధీ సాధించిన మెజార్టీని రాహుల్ గాంధీ దాటేయడం విశేషం. ఇక ప్రస్తుతం రాహుల్ గాంధీ సిట్టింగ్ స్థానమైన కేరళలోని వయనాడ్‌లో వరుసగా రెండోసారి జయకేతనం ఎగుర వేశారు. సీపీఐ అభ్యర్థి అనీ రాజాపై 3.64 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. బీజేపీ తరఫున పోటీ చేసిన కె.సురేంద్రన్ మూడో స్థానానికే పరిమితం అయ్యారు. అయితే తాజాగా ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ క్రమంలోనే రాయ్‌బరేలీ, వయనాడ్ నియోజకవర్గాల్లో ఏ స్థానాన్ని ఉంచుకుంటారు.. ఏ స్థానాన్ని వదులుకుంటారు అనే ప్రశ్నను ఓ రిపోర్టర్ రాహుల్ గాంధీకి సంధించారు.

### కడప ఎంపీ స్థానంలో
# అవినాశ్ రెడ్డి విన్నర్



**విశ్వంభర, కడప :** ఏపీ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షించిన నియోజకవర్గాల్లో కడప లోక్ సభ స్థానం ఒకటి. సిట్టింగ్ వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి... వివేకా హత్యారోపణలు ఎదుర్కోవడం, ఆయనపై షర్మిల, సునీతారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శల దాడి చేయడం వంటి కారణాలతో కడప ఎంపీ స్థానంపై ఆసక్తి నెలకొంది. కడప ఎంపీ స్థానానికి సంబంధించి ఇవాళ ఓటర్ల తీర్పు వెలువడింది. నేడు జరిగిన కౌంటింగ్ లో అవినాశ్ రెడ్డి విజేతగా నిలిచారు. ఆయన 62,695 ఓట్ల తేడాతో తన సమీప టీడీపీ అభ్యర్థి భూపేశ్ రెడ్డిపై విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు. ఆమెకు 41,039 ఓట్లు వచ్చాయి. మరోసారి కడప ఎంపీగా నెగ్గిన అవినాశ్ రెడ్డికి 6,05,143 ఓట్లు రాగా... రెండోస్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి భూపేశ్ రెడ్డికి 5,42,448 ఓట్లు లభించాయి.



# పడి లేచిన లీడర్స్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, కాషాయం పార్టీ దీటుగా ఎదుర్కొని లోక్‌సభ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసింది. ప్రధాని నరేంద్ర మోదీ క్రేజ్‌కు తోడు, కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీని గెలిపిస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఓటర్లకు వివరించగలిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దీటుగా ఎదుర్కోగలిగారు.

#### కరీంనగర్‌లో సిట్టింగ్‌కే పట్టం..

లోక్‌సభ ఎన్నికల్లో బండి సంజయ్ ఘన విజయం సాధించారు. రాజకీయంగా అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్న ఆయన, నవంబరులో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయినా, ఏమాత్రం పట్టు సడలకుండా నియోజవర్గంలోనే ప్రజలకు అందుబాటులో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 2.12లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో బండి సంజయ్ గెలుపొందారు.

#### ఇందూరులో రెండోసారి ఘనవిజయం..

ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ చేతిలో 10,300 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న అర్వింద్ లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి వ్యూహం మార్చారు. మోదీ చరిష్మాకు తోడు.. తన వ్యూహానికి పదును పెట్టారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పోటీ ఇచ్చినప్పటికీ 1.13లక్షలకు పైగా మెజార్టీతో అర్వింద్ విజయం సాధించారు.

#### మెదక్‌లో రఘునందన్ విజయఢంకా..

మెదక్ జిల్లా దుబ్బాక అసెంబ్లీ నుంచి పోటీ చేసిన రఘునందన్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అయినా, ఆయన పై నమ్మకంతో బీజేపీ అధిష్ఠానం మెదక్ టికెట్ ఇచ్చింది. న్యాయవాది, మంచి వాగ్దాటి కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన రఘునందన్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఆదరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను దీటుగా ఎదుర్కొని మెదక్ గడ్డపై 25 ఏళ్ల తర్వాత బీజేపీ జెండా రెపరెపలాడించారు.

#### మల్కాజిగిరిలో ఈటల హవా..

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లోపోటీ చేసిన ఈటల రాజేందర్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి చేతిలో చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో ఈటల పని అయిపోయిందని అంతా అనుకున్నారు. కానీ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఈటల, లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి వ్యూహం మార్చారు. మినీ ఇండియాగా పేరున్న మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి పై 3.86లక్షల ఓట్ల మెజారిటీతో ఎంపీగా జయకేతనం ఎగురవేశారు.

# చావుతప్పి కన్ను లొట్టబోయిన ఎన్డీఏ



### ఆదుకున్న తెలుగు రాష్ట్రాలు

దక్షిణాదిలోనూ ఈసారి మెరుగైన స్థానాలను గెలుస్తామని ధీమా వ్యక్తంచేసిన బీజేపీకి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తమిళనాట బీజేపీ ఒక్క స్థానం కూడా గెలవలేదు. తమిళనాడులో 39కి ఇండియా కూటమి 38 స్థానాల్లో విజయం సాధించింది. కేరళలో మాత్రం బీజేపీ ఒక స్థానం గెలుచుకుంది. ఇండియా కూటమి 18 సీట్లలో విజయం సాధించింది. ఇతరులు ఒక చోట గెలిచారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్డీయే మెరుగైన ఫలితాలు దక్కించుకుంది. ఒడిశాలో అనుకున్న ఫలితాలు రాబట్టడంలో బీజేపీ సఫలమైంది. ఒడిశాలో 79 స్థానాలు గెలుచుకునే దిశగా అడుగులు వేస్తోంది. 21 లోక్‌సభ స్థానాల్లో 19 చోట్ల ఆధిక్యంలో నిలిచి అధికార బీజేడీని బీజేపీ పెద్ద దెబ్బకొట్టింది. లోక్‌సభలో 543 స్థానాలు ఉండగా సూరత్ లోక్‌సభ స్థానం భాజపాకు ఏకగ్రీవమైంది. ఫలితంగా 542లోక్‌సభ స్థానాలకే పోలింగ్ నిర్వహించారు.

**విశ్వంభర, హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 292 స్థానాల్లో గెలిచింది. బీజేపీ 240, తెలుగుదేశం 16, జేడీయూ 12, శివసేన శిందే వర్గం 7, ఎల్జేపీ రామ్‌విలాస్ పాశ్వాన్ వర్గం 5, జనసేన 2, జేడీఎస్ 2, ఆరెల్డీ 2 సీట్లలో విజయం సాధించాయి. ప్రతిపక్ష ఇండియా కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ 99, సమాజ్‌వాదీ 37, తృణమూల్ కాంగ్రెస్ 29, డీఎంకే 22, శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం 9, ఎన్సీపీ శరద్‌పవార్ వర్గం 7, ఆర్జేడీకి 4, సీపీఎం 4, ఆమ్ ఆద్మీ పార్టీ 4 స్థానాలు గెలిచాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమైనప్పటికీ ప్రతిపక్ష కూటమికి ఎన్డీఏకు మధ్య సీట్ల సంఖ్యలో అంతరం తక్కువగానే ఉంది. మూడోసారి మోదీ సర్కార్ కొలువు దీరడానికి మిత్రపక్షాలపై బీజేపీ ఆధారపడాల్సి ఉంది. ఈసారి బలమైన ప్రతిపక్షంతో కేంద్రంలో ప్రభుత్వానికి చిక్కులు తప్పవని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

#### దెబ్బ కొట్టిన రెండు రాష్ట్రాలు

దేశంలోనే అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలు ఉన్న ఉత్తర్ ప్రదేశ్‌లో బీజేపీ, ఇండియా కూటమి మధ్య హోరాహోరీ జరిగింది. 80 స్థానాలు మావే అనుకుంటే ప్రతిపక్ష కూటమి అంతతేలిగ్గా వదల్లేదు. బీజేపీ 37 చోట్లే గెలవగా ఇండియా కూటమి 42 స్థానాలను కైవసం చేసుకుంది. 48 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్న మహారాష్ట్రలో కూడా బీజేపీ కూటమి అనుకున్న రీతిలో ప్రజల మద్దతు కూడగట్టలేకపోయింది. శివసేన, ఎన్సీపీ చీలిక పార్టీలతో మహాయుతి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ కూటమి కంటే శివసేన ఉద్ధవ్ వర్గం, శరద్ పవార్ ఎన్సీపీ పార్టీతో కలిసి కాంగ్రెస్ ఏర్పాటు చేసిన మహావికాస్ అఘాడీ ఎక్కువ స్థానాల్లో విజయం సాధించింది. మహారాష్ట్రలో ఎన్డీవీ 17, ఇండియా కూటమి 30 చోట్ల గెలిచాయి.

#### బీజేపీని నిలువరించిన టీఎంసీ

రాజస్థాన్‌లోనూ బీజేపీ ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయింది. ఇటీవలే రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కమలదళం 25 లోక్‌సభ స్థానాలకుగాను 14 చోట్లే గెలిచింది. 10 చోట్ల ఇండియా కూటమి గెలిచి పట్టు నిలుపుకుంది. బంగాల్‌లో తృణమూల్‌ను గట్టి దెబ్బకొట్టాలని భావించిన కమలదళం ఎన్నికల్లో గట్టి అభ్యర్థులనే నిలిపింది. మెజార్టీ స్థానాలు గెలుస్తామని ధీమాను కనబరిచింది. కానీ అధికార టీఎంసీ బీజేపీని గట్టిగానే నిలువరించింది. 29 స్థానాల్లో గెలిచింది. బీజేపీ 12 స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ ఒక చోట విజయం సాధించింది.



# నిలువ నీడ లేదు.. త్రాగు నీరు లేదు

- మండుటెండల్లో ఉపాధి పనులు
- వసతుల కల్పనలో అధికారులు విఫలం

**పెన్ పహాడ్ మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసే కూలీలు మండుటెండలో పనులు చేస్తూ మగ్గిపోతున్నారు. కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటుంది. దీంతో ఉపాధి కూలీలు ఎండలకు అల్లాడిపోతున్నారు. దీనికి తోడు పని ప్రదేశాలలో మంచినీరు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్స్ కిట్‌లు అందుబాటులో లేకపోవటంతో పలుచోట్ల కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు.**



**విశ్వంభర, పెన్ పహాడ్ జూన్ 04 :** మండలంలో వివిధ గ్రామాలలో దాదాపు 12400 జాబ్ కార్డులకు గాను 28 వేల మంది ఉపాధి కూలీలు నిత్యం ఉపాధి పనుల్లో నిమగ్నమవుతున్నారు. అయితే పని జరుగుతున్న ప్రదేశంలో అవసరమైన వసతులు కల్పించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ మండుటెండల్లో చెమటోడుస్తున్నారు. కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ లు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఉపాధి కూలీలు ఆరోపిస్తున్నారు. పని చేసే సందర్భంలో గాయపడినా, అస్తవ్యస్తతపు గురైన వారికి ప్రాథమిక చికిత్స అందించేందుకు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచకపోవడం, ఎండలో త్రాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట మంచి నీటి వసతితో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు ఇవ్వాలని టెంట్లతో నీడ కల్పించాలని జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఆకస్మిక తనిఖీలు చేస్తున్నప్పటికీ ఎక్కడైనా కనీస వసతులు కల్పించడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో గుడారాలు మంచినీటి సౌకర్యం కల్పించాలని గ్రామాల ఉపాధి హామీ కూలీలు అధికారులను వేడుకుంటున్నారు.

ఇదే సంఘటన మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో గురువారం జరగడంతో ఉపాధి హామీ కూలీలు గతవారం టెంటు ఏర్పాటు చేసిన అధికారులు ఈ వారం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని, ఉపాధి పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు టెంటు, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసేవారని కానీ ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి హామీ పథకం నీరుగారి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

#### అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు అన్ని ఏర్పాటు చేయాలి.

– ఎంపీడీఓ వెంకటేశ్వర్ రావు

# చరిత్ర సృష్టించిన నారా లోకేష్..

- మంగళగిరిలో విజయఢంకా
- అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన యువగళం
- పప్పు కాదు.. నిప్పు అంటూ నిరూపించిన లోకేష్
- 1985 నుంచి ఇప్పటి వరకు గెలవని టీడీపీ



**విశ్వంభర, మంగళగిరి :** నారా లోకేష్ చరిత్ర సృష్టించారు. ఏపీ రాజకీయాల్లో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు. దశాబ్దాలుగా టీడీపీకి దక్కని సీటును తన సొంతం చేసుకున్నారు. మంగళగిరిలో విజయఢంకా మోగించారు నారా లోకేష్. దాదాపు 64వేలకు పైగా ఓట్ల తేడాతో తన సమీప అభ్యర్థి లావణ్యపై ఆయన విజయం సాధించారు. ఇక్కడ 1985 నుంచి ఇప్పటి వరకు టీడీపీ గెలవలేదు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి నారా లోకేష్ పోటీ చేశారు. కానీ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. కానీ ఆయన నియోజకవర్గాన్ని వదిలిపెట్టలేదు. అక్కడే ఉంటూ సేవా కార్యక్రమాలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చారు. అదే ఆయనకు ప్లస్ అయిపోయింది. దాంతో ప్రజల్లో ఆయనపట్ల సానుకూలత బాగా పెరిగింది. అందుకే ఈ ఎన్నికల్లో ఆయనకు భారీగా మెజార్టీ సొంతం అయిందని చెబుతున్నారు. దాంతో తమ యువ నాయకుడు చరిత్ర సృష్టించారని టీడీపీ నేతలు సంబురాల్లో మునిగితేలారు. ఇన్ని రోజులు పప్పు అంటూ ఎగతాళి చేసిన వైసీపీకి.. పప్పు కాదు నిప్పు అంటూ నిరూపించారని అంటున్నారు టీడీపీ నేతలు.

# పిఠాపురంలో పవన్ గెలుపు..

**మాజీ భార్య రేణూ దేశాయ్ పోస్ట్**



**విశ్వంభర, హైదరాబాద్ :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించారు. జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం కూటమిని ఏర్పాటు చేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. ఓటు షేర్ అయ్యేలా పని చేసి రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంలో కీలక పాత్రను పోషించారు. ఎన్నికల ఫలితాల్లో కూటమి భారీ విజయం దిశగా దూసుకెళ్తుండడంతో పవన్ కల్యాణ్‌ను అభినందిస్తూ సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన మాజీ భార్య రేణూ దేశాయ్ సైతం స్పందించారు. కూతురు ఆద్య టీ గ్లాస్ పట్టుకున్న వీడియోని ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ గెలుపుతో ఆద్య అండ్ అకిరా ఎంతో ఆనందంగా ఉన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఈ విజయంతో లబ్ది పొందుతారని తాను ఆశిస్తున్నట్లు రాసుకొచ్చారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పవన్ కల్యాణ్ తన సమీప ప్రత్యర్థి వంగా గీతపై 69,169 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో జనసైనికుల సంబరాలు మిన్నంటాయి.

# అన్నగా గర్వంగా ఉంది

- నీ కలల్ని నెరవేర్చుకున్నావు
- ఎక్కడ నెగ్గాలో.. ఎక్కడ తగ్గాలో తెలుసు
- ప్రజల సంక్షేమం వైపు నిన్ను నడిపిస్తోంది
- పవన్‌కు ఎక్స్ వేదికగా చిరు విషెస్



**విశ్వంభర, అమరావతి:** ఒక అన్నగా చాలా గర్వంగా ఉందని మెగాస్టార్ చిరంజీవి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి ట్వీట్ చేశారు. పవన్ కళ్యాణ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో పిఠాపురం నుంచి పోటీ చేసిన ఆయన 70 వేలకు పైగా ఓట్లతో గెలుపొందారు. దీంతో ఈసారి పిఠాపురం నుంచి మెజారిటీతో గెలిచి మొదటి సారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. దీంతో ఆయన గెలుపుపై చిరంజీవి స్పందిస్తూ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా శుభాకాంక్షలు తెలిజజేశారు. 'డియర్ కళ్యాణ్ బాబు.. ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని నెగ్గించటానికే అని నిరూపించిన నిన్ను చూస్తుంటే ఒక అన్నగా గర్వంగా వుంది. నువ్వు గేమ్ చేంజర్‌వి మాత్రమే కాదు, మ్యాన్ ఆఫ్ మ్యాచ్‌వి కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది. నీ కృషి, నీ త్యాగం, నీ ధ్యేయం, నీ సత్యం జనం కోసమే ఈ అద్భుతమైన ప్రజా తీర్పు, రాష్ట్ర భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం కోసం, అలాగే నీ కలల్ని, నువ్వేర్పరుచుకున్న లక్ష్యాల్ని నిజం చేసే దిశలో నిన్ను నడిపిస్తాయని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తూ, శుభాభినందనలు. నీవు ప్రారంభించే ఈ కొత్త అధ్యాయంలో నీకు శుభం కలగాలని అంటూ' చిరంజీవి ట్వీట్ చేశారు.

**చంద్రబాబుకు విషెస్..**

ఏపీలో కూటమి విజయం సాధించడంతో చంద్రబాబుకు ప్రత్యేకంగా విషెస్ తెలిపారు చిరంజీవి. ఈ క్రమంలో ఎక్స్ లో ఇలా రాసుకొచ్చారు చిరంజీవి. ప్రియమైన చంద్రబాబు నాయుడు గారికి , చరిత్రలో అరుదైన విజయాన్ని అందుకున్న మీకు ముందుగా శుభాకాంక్షలు, అభినందనలు. ఈ మహత్తర విజయం, మీ మీద ప్రజలకు వున్న నమ్మకానికి, మీ నాయకత్వ పటిమకు, రాష్ట్రానికి గత వైభవం తిరిగి తేగలిగిన మీ దక్షతకు నిదర్శనం. రాజకీయ దురంధరులైన మీ మీద, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోడీ గారి మీద ప్రజలు కనపరచిన విశ్వాసాన్ని సంపూర్ణంగా నిలబెట్టుకొని, రాజధాని లేని, గాయపడిన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టి నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను అంటూ రాసుకొచ్చారు చిరంజీవి.

## పులివెందులలో జగన్ విజయం

- భారీగా తగ్గిన మెజార్టీ



**విశ్వంభర, కడప :** పులివెందులలో జగన్ సునాయా సంగా విజయం సాధించారు. ఆయన గెలుపు ఎలాగూ లాంఛనమే అయినా.. గతంతో పోలిస్తే ఈ సారి భారీగా మెజార్టీ తగ్గింది. జగన్ ఈ సారి తన ప్రత్యర్థి అయిన టీడీపీ అభ్యర్థి రవీంద్రనాథ్ రెడ్డి మీద 59వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇది మంచి మెజార్టీనే అయినా.. గత ఎన్నికలతో పోలిస్తే భారీగా మెజార్టీ తగ్గిందని చెప్పుకోవాలి. గత 2019 ఎన్నికల్లో జగన్ కు 90 110 ఓట్ల భారీ మెజార్టీ దక్కింది. కానీ ఈ సారి పార్టీ ఓడిపోవడంతో పాటు జగన్ కు కూడా భారీగానే ఓట్లు తగ్గాయి. రవీంద్రనాథ్ రెడ్డి భారీ గా ఓట్లు కొల్లగొట్టారు. జగన్ సొంత ఇలాకా కడప జిల్లాలో వైసీపీకి తీవ్రమైన ఎదురుగాలి వీస్తోంది. ఇందుకు ఆయనకు తగ్గిన మెజార్టీనే ఉదాహరణ.

# వైసీపీ ఓటమికి కారణాలు ఇవే..!

- సంక్షేమం తప్ప అభివృద్ధి ఏది..?
- రెడ్లలో తీవ్ర అసంతృప్తి
- రాజధాని లేకపోవడం మైనస్
- చంద్రబాబు, పవన్‌ను వ్యక్తిగతంగా అవమానించడం
- వలంటరీ వ్యవస్థతో కేడర్ డీలా



**విశ్వంభర, విజయవాడ :** వైసీపీకి ఘోరమైన దెబ్బ పడింది. ఇప్పటి వరకు వైసీపీ చరిత్రలోని లేని విధంగా దారుణమైన ఓటమిని మూటగట్టుకుంది. గత ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీ సీట్లతో అధికారాన్ని సింగిల్ గా చేజిక్కించుకున్న వైసీపీ.. ఈ ఎన్నికల్లో మాత్రం కనీవినీ ఎరగని రీతిలో ఓటమి పాలైంది. ఓటమి అంటే అది మా మూలు ఓటమి కాదు.. ఇంత దారుణంగా ప్రజలు ఇప్ప టి వరకు ఏ అధికార పార్టీని వ్యతిరేకించలేదేమో. అంత ఘోరంగా ఓడిపోయింది వైసీపీ. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవ చ్చు. మరి వైసీపీని ఇంత దారుణంగా ప్రజలు వ్యతిరేకిం చడానికి కారణాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం.

**సంక్షేమమే.. అభివృద్ధి లేదు..**

జగన్ ఐదేండ్ల పాలనలో చూసుకుంటే ఎక్కువగా సంక్షేమం మీదనే దృష్టి పెట్టారు. అంతే తప్ప అభివృద్ధిని ఎక్కడా చూపించలేకపోయారు. పైగా ఏపీకి రాజధాని లేకుండా చేశాడనే అపవాదును కూడా మూటగట్టుకున్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల అకౌంట్లలో నేరుగా డబ్బులు వేస్తే వాళ్లు ఓట్లేస్తారని అనుకోవడం అవివేకమే అవుతుంది. అభివృద్ధి లేకుండా కేవలం సంక్షేమమే అంటే ఎవరూ పట్టించుకోరు. అందుకే జగన్ ఓటమిలో ఇది కీలక పాత్ర పోషించింది.

**చంద్రబాబు, పవన్‌కు అవమానాలు..**

వైసీపీ హయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కు దారుణమైన అవమానాలు జరిగాయి. అవి ప్రజల్లో వారికి సానుభూతిని బాగా పెంచాయి. మరీ ముఖ్యంగా చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అసెంబ్లీ సాక్షిగా అవమానించడం, పవన్ కల్యాణ్ ను పదే పదే మూడు పెళ్లిళ్లు అంటూ వైసీపీ మంత్రులు, నేతలు సెటైర్లు వేయడం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకువచ్చింది. అందుకే ఈ ఎన్నికల్లో వైసీపీకి ఆ ఎఫెక్ట్ పడింది.

**రాజధాని లేకపోవడం..**

ఏపీలో ప్రధానంగా రాజధాని చుట్టే ఈ ఐదేండ్లు రాజకీయాలు నడిచాయి. చంద్రబాబు అమరావతిని రాజధాని చేస్తే.. జగన్ దాన్ని రద్దు చేయడం తీవ్ర విమర్శలకు తావు తీసింది. అంతే కాకుండా మూడు రాజధానులు అంటూ చట్టం చేయడం.. అది కోర్టులో నిలబడకపో వడంతో.. అసలు ఏపీకి రాజధాని అనేది లేకుండా జగనే చేశాడు అని ప్రతిపక్షాలు బలంగా ప్రచారం చేశాయి. ప్రజల్లో ఇది బాగా ప్రభావం చూపించి చివరకు జగన్ ఓటమికి కారణం అయింది.

**రెడ్లలో అసంతృప్తి..**

ఏపీలో మద్యం షాపులను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవ డం వల్ల ఒక సామాజిక వర్గం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతే కాకుండా వైసీపీకి మొదటి నుంచి అండ గా ఉంటున్న రెడ్డి సామాజిక వర్గాన్ని ఇబ్బంది పెట్టాడు జగన్. మూడు రాజధానుల పేరుతో రియల్ ఎస్టేట్‌ను పడగొట్టాడు. దాంతో రెడ్డి సామాజిక వర్గం తీవ్రంగా జగన్‌ను వ్యతిరేకించింది. అంతే కాకుండా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నినా దం అందుకుని పార్టీలో, ప్రభుత్వంలో రెడ్ల ప్రాధాన్యతను తగ్గించడంతో వారంతా వ్యతిరేకంగా మారారు.

**కేడర్‌లో ఆగ్రహం..**

జగన్ అంటే చాలా మంది కేడర్ కు పిచ్చి ఉండేది. ఒకప్పుడు జగన్ కోసం టీడీపీ నేతలతో కొట్లాడి తలలు పగలగొట్టుకున్న కరుడుగట్టిన వైసీపీ కార్యకర్తలు ఎంతో మంది ఉన్నారు. అయితే జగన్ ఒకసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేడర్ ను అస్సలు పట్టించుకోలేదు. వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి కేడర్ ను నీరుగార్చారు. గ్రామాల్లో వైసీపీ కార్యకర్తల్లో ఇది తీవ్రంగా వ్యతిరేకతను తీసుకొచ్చింది. దాంతో వారంతా ఈ సారి గట్టిగా పోరాడలేదు. అందుకే ఈ ఎన్నికల్లో వైసీపీకి దారుణమైన దెబ్బ పడింది.

# పదవులు శాశ్వతం కాదు

- ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం
- ఓటమిపై జగన్ భావోద్వేగం
- ఐదేళ్లు తప్ప మొత్తం ప్రతిపక్షంలో ఉన్నా
- ఐదేండ్లుగా పేదవాళ్లకు అండగా ఉన్నాం
- ఏం జరిగిందో అర్థం కావట్లేదు
- ఏ ప్రభుత్వం చేయని పనులు చేశాం
- మేనిఫెస్టో హామీలు 99 శాతం పూర్తి
- కన్నీళ్లు ఆపుకుంటూ మాట్లాడిన సీఎం
- ముఖ్యమంత్రి పదవికి రాజీనామా



**విశ్వంభరం, తాడేపల్లి :** ఏపీ సార్వత్రిక ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఏపీ ఫలితాలపై మంగళవారం ఆయన తాడేపల్లి కార్యాలయంలో మీడియాలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల కోసం ఎంతో తాపత్రయపడ్డామని వెల్లడించారు. ఎంతో చేయాలని అనుకున్నామని చెప్పారు. ఎంత మంచి పని చేసిన కూడా ఏమెందో తెలియడం లేదన్నారు. ప్రజల కష్టాలే తన కష్టాలుగా బావించానని పేర్కొన్నారు. హామీ ఇచ్చిన అన్ని సంక్షేమ పథకాలు అందించామన్నారు. గతంలో ఎప్పుడూ జరగని పని చేశామన్నారు. అవ్వాతాతలు చూపిన ఆప్యాయత ఏమైందో తెలియడం లేదని భావోగ్వేగానికి గురయ్యారు. అక్కా చెల్లెళ్ల అప్యాయత ఏమైందో అర్థం కావడం లేదన్నారు. అరకోటి రైతుల ప్రేమ ఏమైందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉన్నామన్నారు. అక్కా చెల్లెళ్ల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించామని వెల్లడించారు. అమ్మఒడితో కోటి 53 లక్షల మందికి మంచి చేశామన్నారు. ఆటోలు నడుపుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనమిత్ర పథకం తీసుకువచ్చామన్నారు. కోట్ల మందికి మంచి చేసిన వారి ప్రేమ దక్కలేదన్నారు. తాము గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చామని తెలిపారు. ఎప్పుడూ చూడని విధంగా సచివాలయంలో వాలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చామని గుర్తు చేశారు. ప్రజల తీర్పును సంతోషంగా తీసుకుంటాం అంటూ తెలిపారు. అన్ని రంగాల్లో మార్పు తీసుకువచ్చి పేదవాడికి అండగా ఉన్నామని, తాము అధికారంలోకి వచ్చన తర్వాత రాష్ట్రంలో ఏం జరిగిందో ఆ దేవునికి తెలుసని ఓటమిపై ఉద్వేగంతో మాట్లాడారు. సామాజిక న్యాయం అంటే ఇదని ప్రపంచానికి చూపించామన్నారు.

**ప్రజలకు ఎప్పుడూ తోడుగా ఉంటాం..**

ప్రజల తీర్పు తీసుకుంటామని, కానీ, మంచి చేయడానికి మాత్రం ఎప్పుడూ ప్రజలకు తోడుగా ఉంటామని స్పష్టం చేశారు. పేదవాడికి అండగా ఉండే విషయంలో వారికి ఎప్పుడూ తోడుగా ఉంటామని, తమ గళం వినిపిస్తూ వారికి అండగా నిలుస్తామని చెప్పారు. పెద్ద పెద్ద వాళ్ల కూటమి ఇది. ఢిల్లీని శాసించే వారి కూటమి ఇది.. ఈ కూటమిలో ఉన్న బీజేపీకి, టీడీపీకి, పవన్ కల్యాణ్‌కు, వారి గొప్ప విజయానికి అభినందనలు తెలియజేశారు. తన ప్రతి కష్టంలో తోడుగా, అండగా నిలబడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు, వాలంటీర్‌కు, ప్రతి ఇంట్లో నుంచి వచ్చిన స్టార్ క్యాంపెయినర్‌కు అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ ఐదు సంవత్సరాలు తప్ప, తన రాజకీయ జీవితమంతా ప్రతిపక్షంలో గడిపానని, రాజకీయ జీవితంలో ఎవరూ చూడని కష్టాలను భరించానని ఎమోషనల్ అయ్యారు. ఇప్పుడు అంతకన్నా ఏమన్నా ఎక్కువ కష్టాలు పెట్టినా, భరించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు.

**సీఎం పదవికి రాజీనామా**

ముఖ్యమంత్రి పదవికి జగన్‌మోహన్ రెడ్డి రాజీనామా చేశారు. విజయవాడ రాజ్‌భవన్‌లోని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తన రాజీనామా లేఖను పంపారు. ఈ ఫలితాల్లో కూటమి విజయ ఢంకా మోగించడంతో ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుంటు గవర్నమెంట్‌లోకి వచ్చిన వారికి అభినందనలు తెలియజేశారు జగన్



# చంద్రబాబు ఇంట సంబురాలు

**కేక్ కట్ చేసిన మనవడు**

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. టీడీపీ కూటమి ఏపీలో క్లీన్ స్వీప్ చేసింది. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల శ్రేణులు విజయోత్సవ సంబురాలు చేసుకుంటున్నారు. ఏపీకి కాబోయేసీఎం నారా చంద్రబాబు నాయుడు తన ఇంట్లో విక్టరీ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. కుటుంబ సభ్యుల నడుమ కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. నారా, నందమూరి కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు మనవడు దేవాన్ష్ కేక్ కట్ చేసి.. తాతకు, బంధువులకు కేక్ తినిపించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## 9న చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- అమరావతిలోనే ఏర్పాట్లు
- డిప్యూటీ సీఎంగా పవన్..?

**విశ్వంభర, మంగళగిరి:** ఏపీలో కూటమి భారీ విజయం సాధించింది. కనీ వినీ ఎరగని రీతిలో కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసి.. బంపర్ మెజార్టీని టీడీపీ కూటమి సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారానికి అన్నీ రెడీ అయిపోతున్నాయి. ఈ నెల 9న అమరావతిలోనే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని టీడీపీ శ్రేణులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి పవన్ కల్యాణ్ తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ భేటీలో ప్రభుత్వ ఏర్పాటుతో పాటు తొలి విడతలో ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలనేదానిపై చర్చించారు. అంతేకాకుండా కేంద్రంలో ఎన్డీయే కూటమికి మద్దతు తెలపడంపై కూడా చర్చించారు. అయితే ఇప్పుడు జనసేన నుంచి బలమైన డిమాండ్ వస్తోంది. పవన్ కల్యాణ్ ఎక్కడకు వెళ్లినా సీఎం సీఎం అంటూ జనసైనికులు నినాదాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్ కు డిప్యూటీ సీఎం పదవి అయినా ఇస్తారేమో అని అంతా ఆశిస్తున్నారు. దానిపై ఇంకా చర్చలు జరగాల్సి ఉంది. అప్పట్లో లోకేష్ మాట్లాడుతూ పవన్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడంపై టీడీపీ నిర్ణయం తీసుకుంటుంది అని చెప్పారు. కాబట్టి ఇప్పుడు పవన్ కు ఏ పదవి వస్తుందో చూడాలి.

# రికార్డులు బ్రేక్

## నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్ సునామీ

**నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇదే హయ్యేస్ట్**

**దరిదాపుల్లో లేని ప్రత్యర్థులు**

**5.51 లక్షల మెజార్టీ దాటేసిన రఘువీర్ రెడ్డి**

**కేసీఆర్, పీవీ రికార్డులు బ్రేక్..!**



**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:**

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో రికార్డులన్నీ మారుమోగాయి. ఒకటీ కాదు రెండు కాదు.. ఏకంగా ఐదు లక్షల మెజార్టీని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి దాటేసి విజయం సాధించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి పార్లమెంటు రికార్డులన్నింటినీ బ్రేక్ చేసేశారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గానికి ఇప్పటివరకు 17 సార్లు ఎంపీ ఎన్నికలు జరిగితే.. ఇప్పటివరకు ఇదే హయ్యేస్ట్ రికార్డుకావడం గమనార్హం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో నల్లగొండ నుంచి కాంగ్రెస్ తరపున మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి తనయుడు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్ రెడ్డి బరిలోకి దిగారు. బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పోటీ చేశారు. అయితే మొదటి నుంచి నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే కుందూరు రఘువీర్ రెడ్డి భారీ మెజార్టీ దిశగా ముందుకు వెళుతున్నారు. అయితే ప్రచార పర్వంలోనూ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డికి ప్రజల నుంచి విశేష మద్దతు లభించింది. ఈ క్రమంలోనే ఎన్నికల ఫలితాల్లో ఊహించని విధంగా మెజార్టీ లభించింది.

**దరిదాపుల్లో లేని బీజేపీ, బీఆర్ఎస్**

తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ, బీజేపీ జోరు విపరీతంగా ఉంది. ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ కనీస ప్రభావం చూపలేకపోయింది. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు కుందూరు రఘురవీర్ రెడ్డి భారీ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇప్పటివరకు రఘువీర్ రెడ్డికి 7,84,337 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి 2,24,431 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల క్రిష్ణా రెడ్డి 2,18,417 ఓట్ల వచ్చాయి. అయితే నల్లగొండలో బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పరిమితం అయ్యింది. తెలంగాణ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌లో బీఆర్ఎస్ పార్టీ దాదాపు మూడో స్థానంలోనే ఉంటోంది. మొత్తంగా ఇప్పటివరకు నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి 5,59,906 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అయితే 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి 5,26,028 ఓట్లు సాధించగా, టీఆర్ఎస్ అభ్యర్థి వేమిరెడ్డి నర్సింహారెడ్డి 500346 ఓట్లు సాధించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం 25,682 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

**తొలి ఎన్నికల్లో రావి రికార్డు**

మొదటి నుంచి చారిత్రక ప్రాధాన్యం కలిగిన నల్లగొండ లోక్‌సభ స్థానంలో 1952లో జరిగిన మొద టి లోక్‌సభ ఎన్నికల్లో అప్పటి పీడీఎఫ్ అభ్యర్థి, కమ్యూనిస్టునేత రావి నారాయణరెడ్డి దేశవ్యాప్తంగా అత్యధిక మెజార్టీ సాధించారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 3,09,162 ఓట్లు రాగా, 2,22,280 ఓట్ల మెజార్టీ వచ్చింది. అప్పట్లో ఇది దేశవ్యాప్త రికార్డు మెజార్టీ. ఆ గౌరవంతోనే ఆయనతో పార్లమెంట్ భవనాన్ని ప్రారంభం చేయించారు. అంతటి ప్రాధాన్యం కలిగిన లోక్‌సభ నియోజకవర్గ స్థానంలో మళ్లీ 72 ఏళ్ల తర్వాత ఆ స్థాయి రికార్డు స్థాయి మెజార్టీని కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి సాధించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి ఏకంగా 7,84,337 ఓట్లను సాధించారు. దీంతో మెజార్టీ 5,59,906 ఓట్లకు చేరుకుంది. ఇంకా మెజార్టీ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు 1994 ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంటు నుంచి గుత్తా సుఖేందర్ రెడ్డి 1,93,156 ఓట్ల మెజార్టీ సాధించారు. అయితే రఘువీర్ రెడ్డి ఈ ఎన్నికల్లో సాధించిన మెజార్టీతో పార్లమెంటు రికార్డులన్నీ బ్రేక్ కాబోతున్నాయి.

**దాదాపుగా రికార్డులన్నీ బ్రేక్..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక మెజార్టీలను పరిశీలిస్తే 1991 లోక్‌సభ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు 5,80,297 ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మొదటిసారి తెలుగుబిడ్డ ప్రధానమంత్రి పదవిని అధిరోహించిన నేపథ్యంలో ఆయన గౌరవార్థం అప్పటి ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం అభ్యర్థిని పోటీలో నిలపలేదు. అయితే బీజేపీ నుంచి బంగారు లక్ష్మణ్ పోటీచేయగా, ఆయనకు కేవలం 45,944 ఓట్లు మాత్రమే వచ్చాయి. జిల్లాకు చెందిన మోత్కుపల్లి నరసింహులు స్వతంత్ర అభ్యర్థిగా ఆ ఎన్నికల్లో పోటీచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014 ఎన్నికల్లో మెదక్ నుంచి గెలుపొందిన మా జీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుదే ఆల్‌టైమ్ రికార్డు. ఆయనకు ఆ ఎన్నికలో 3,97,029 ఓట్ల భారీ మెజార్టీ దక్కింది. స్వతంత్ర భారతదేశంలో తెలంగాణ నుంచి ఆల్‌టైమ్ రికార్డు మెజార్టీ కూడా ఇదే. అదే ఎన్నికల్లో వరంగల్ నుంచి గెలుపొందిన కడియం శ్రీహరి (బీఆర్ఎస్) 3,92,574 ఓట్ల మెజార్టీతో రెండో స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో వరంగల్ నుంచి గెలుపొందిన పసునూరి దయాకర్ 3,50,298 ఓట్ల మెజార్టీ దక్కింది. అయితే ప్రస్తుతం నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి 5,52,659 ఓట్ల మెజార్టీ దిశగా ఉన్నారు. ఈ మెజార్టీతో తెలంగాణలో ఇప్పటికే ఆల్ టైమ్ రికార్డుగా ఉన్న కేసీఆర్( 3,97,029), కడియం శ్రీహరి (బీఆర్ఎస్) 3,92,574 ఓట్లు, 2019 ఎన్నికల్లో వరంగల్ నుంచి గెలుపొందిన పసునూరి దయాకర్ 3,50,298 ఓట్ల మెజార్టీని బ్రేక్ చేసేశారు.

### దేశంలో భారీ మెజారిటీ వీరిదే

బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిపై ఏకంగా 5.51 లక్షల మెజార్టీతో గెలుపు బావుటా ఎగరేసి.. రికార్డు సృష్టించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక మెజార్టీ సాధించిన పార్లమెంట్ సభ్యుడు పీవీ నర్సింహారావు. ఇప్పటి వరకు దేశంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఎంపీల్లో మూడో వ్యక్తి కూడా ఆయనే. 1991లో కర్నూలు జిల్లాలోని నంద్యాల లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో పీవీ 5.8 లక్షల పైచిలుకు ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థి బంగారు లక్ష్మణ్‌పై గెలుపొందారు. అలాగే 2011లో కాంగ్రెస్ నుంచి కడప ఎంపీగా పోటీ చేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 5.43 లక్షల మెజార్టీ సాధించారు. ఇప్పుడు రఘువీర్ రెడ్డి 5.51 లక్షల మెజార్టీ వచ్చింది. ఇక దేశంలో ఎవరికి మెజార్టీ వచ్చిందో గమనిస్తే డాక్టర్ గౌతమ్ గోపినాథ్ ముండే భారత దేశ ఎన్నికల చరిత్రలో రికార్డు సృష్టించారు. మహారాష్ట్రలోని బీడ్ స్థానం నుంచి పోటీ చేసి.. గెలుపే కాకుండా సుమారు 6.9 లక్షల మెజార్టీతో చరిత్ర సృష్టించారు. కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ రావు శంకర్ రావు పాటిల్‌పై 6,96, 321 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

# కంటోన్మెంట్ కాంగ్రెస్‌దే

**విశ్వంభర, హైదరాబాద్:** కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దింపిన శ్రీ గణేష్ విజయాన్ని అందుకున్నారు. ఈ విజయంతో కాంగ్రెస్‌కు 65 సీట్లు ఆ పార్టీ ఖాతాలో పడ్డాయి. అదే విధంగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ 39 సిట్టింగ్ ఎమ్మెల్యేల సంఖ్య 28కి చేరింది. దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదితపై 13 వేల ఓట్లతో శ్రీ గణేష్ ఘన విజయం సాధించారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ లాస్య నందిత మృతితో కంటోన్మెంట్ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ సారి ఎన్నికల్లో మూడు పార్టీల నుంచి కొత్త అభ్యర్థులు పోటీ చేశారు. బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్.. పార్టీ మారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. బీఆర్ఎస్ నుంచి లాస్య నందిత సోదరి నివేదిత పోటీ చేశారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ వంశ తిలక్‌కు టికెట్ కేటాయించింది. అయితే ప్రధానంగా పోటీ శ్రీ గణేష్ లాస్య నందిత మధ్యే నెలకొని ఉంది. ఏడు రౌండ్లు పూర్తయ్యే సమయానికి శ్రీ గణేష్ కు 24,424 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితకు 16,761 ఓట్లు పోలయ్యాయి. 14,712 ఓట్లు బీజేపీ అభ్యర్థి వంశ తిలక్ వచ్చాయి.

# అభివృద్ధి పథం వైపు సాగుదాం

**విశ్వంభర, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగిద్దామని ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వెల్లడించారు. సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి పథం వైపు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సీఎం సొంత ఇలాకాలో బీజేపీ గెలుపు

**విశ్వంభర, మహబూబ్ నగర్:** సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాకా అయిన మహబూబ్ నగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీ చంద్ రెడ్డిపై డీకే అరుణ 3,410 ఓట్ల మెజార్టీ విజయం సాధించారు. మహబూబ్ నగర్ సొంత నియోజకవర్గం కావటంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటనలో మహబూబ్ నగర్ నుంచి వంశీ చంద్ రెడ్డినే తొలి అభ్యర్థిగా ప్రకటించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచి రేవంత్ రెడ్డి అత్యధికసార్లు ఆ నియోజకవర్గంలో బహిరంగ సభలు నిర్వహించి వంశీ చందర్ రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయినా మహబూబ్ నగర్ ప్రజలు డీకే అరుణకే మద్దతు నిలిచారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించినప్పటికీ స్వల్ప ఓట్ల తేడాతోనే విజయం సాధించడం గమనార్హం. మరోవైపు తెలంగాణలో 17 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క నియోజకవర్గంలోనూ విజయం సాధించలేక పోయింది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్ని ఇచ్చే విషయం అయినప్పటికీ.. 10 నుంచి 14 స్థానాల్లో విజయం సాధిస్తామని భావించిన కాంగ్రెస్ కేవలం ఎనిమిది స్థానాలకే పరిమితం కావటం.. బీజేపీ అనూహ్యంగా పుంజుకొని అధికార కాంగ్రెస్ పార్టీకి పోటీగా నిలుస్తూ ఎనిమిది నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు విజయ సాధించడం కాంగ్రెస్ పార్టీకి కాస్త ఇబ్బందికర విషయమని చెప్పొచ్చు.

# ఓటమి నిరాశ కలిగించింది

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎనిమిది స్థానాలకు దక్కించుకున్నాయి. అలాగే ఎంఐఎం పార్టీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. ఈ ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ ఫినిక్స్ పక్షిలాంటిదని అంటూ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి నిరాశ కలిగించేదే అయినప్పటికీ.. తిరిగి పుంజుకుని ఎప్పటిలాగే ప్రజల పక్షాన నిలబడతామని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ స్థాపించి 24 ఏళ్ల సుదీర్ఘకాలంలో అన్నిరకాల ఎత్తుపల్లాలను చూశామన్నారు. రాష్ట్రాన్ని సాధించడమే అతి పెద్ద విజయమని, రెండు సార్లు అద్భుతమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని, 2014లో 63 సీట్లు, 2018లో 84 సీట్లు సాధించుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం అసెంబ్లీలో 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నామని అన్నారు. ఈరోజు వచ్చిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కచ్చితంగా నిరాశను కలిగించాయన్నారు. అయినా ఎప్పటిలాగే మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్న విశ్వాసం ఉందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఫీనిక్స్ పక్షి లెక్క తిరిగి పుంజుకుంటామని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మూడోసారి వస్తున్నాం

**విశ్వంభర, ఢిల్లీ:** ఎన్నికల ఘట్టాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభినందనలు తెలియజేశారు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి ఆదర్శమని అన్నారు. మంగళవారం ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మోడీ మాట్లాడారు. బీజేపీకి దేశ ప్రజలు అద్భుతమైన విజయాన్ని అందించారు. మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. జమ్ము కశ్మీర్ ఓటర్లు సరికొత్త చరిత్ర సృష్టించారని, కశ్మీర్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ జరిగిందన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన అన్ని పార్టీలకు, అభ్యర్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. అరుణాచల్, ఏపీ, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచామన్నారు. ఏపీ, ఒడిశా ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఒడిశాలో తొలిసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కేరళలో తొలిసారి బీజేపీ సీటు గెలుచుకుందని స్పష్టం చేశారు. 1992 తరువాత కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారం చేపట్టబోతుందన్నారు.

**ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీలో క్లీన్ స్వీప్**

తెలంగాణలో కూడా బీజేపీ గెలిచిన సీట్ల సంఖ్య రెట్టింపయ్యిందన్నారు. ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, ఢిల్లీలో క్లీన్ స్వీప్ చేశామన్నారు. ఏపీలో టీడీపీ అధినేత చంద్రబాబు అద్భుత ఫలితాలు సాధించారని ప్రశంసించారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రగతికి పెద్దపీట వేస్తుందని ప్రధాని మోడీ అన్నారు. దేశంలో ఎన్నికలు నిర్వహణ ప్రతి ఒక్కరు గర్వించేలా ఉందన్నారు, ఇది భారతీయుల విజయమన్న మోడీ.. దేశ అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశాన్ని సాంకేతిరంగంలో అభివృద్ధి చేస్తామన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఎన్డీఏ పాలన చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజనీతికి కట్టుబడి ఉందన్నారు. ఎన్డీఏ విజయం సాధించడంలో జేపీ నడ్డా కృషి చేశారని ప్రధాని మోడీ కొనియాడారు.



# 25 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి విజయం

**విశ్వంభర, మడకశిర :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో మడక శిర నియోజకవర్గం వార్తల్లో నిలిచింది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు తన సమీప వైసీపీ అభ్యర్థి ఇర లక్కప్పపై 25 ఓట్ల అత్యల్ప మెజారిటీతో గెలిచారు. రెండు అతి పెద్ద పార్టీల మధ్య హోరా హోరీ పోరు. పోనీ ఓట్లేమన్నా పది ఇరవై వేల లోపు ఉన్నాయా అంటే అదీ కాదు. లక్షా యాభైవేలకు పైగా పోలైన ఓట్లలో చివరికి అభ్యర్థి గెలిచిన తేడా ఎంతో తెలుసా కేవలం 25 ఓట్లు. అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలో అద్భుతం చోటు చేసుకుంది. హోరా హోరీగా జరిగిన పోటీలో విజయం టీడీపీ, వైసీపీ అభ్యర్థులతో దోబూచులాడింది. అభ్యర్థులు చివరి రౌండు వరకు విజయం తమదేననే ధీమాతో కొనసాగారు. కాగా 18 రౌండ్ల పాటు జరిగిన కౌంటింగ్ లో చివరికి టీడీపీ అభ్యర్థి తన సమీప అభ్యర్థి ఇర లక్కప్పపై 25 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచారు. మొత్తం లక్షా యాభైవేల ఓట్లకు పైగా పోలవ్వగా టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజుకు 78,387 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి ఎస్‌ఎల్ ఇర లక్కప్పకు 78322 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకూ ఇదే అత్యల్ప మెజారిటీగా తెలుస్తోంది.

# గులాబీకి 'గుండు సున్నా'

(మొదటి పేజీ తరువాయి)

ఎనిమిది సీట్లను దక్కించుకున్నాయి. ఒక సీటును ఎంఐఎం పార్టీ దక్కించుకోగా.. బీఆర్ఎస్ మాత్రం ఖాతా తెరవలేకపోయింది. గులాబీ దళపతి కంచుకోట అనుకున్న మెదక్ పార్లమెంట్ స్థానంలో కూడా బీజేపీ జెండా పాతేసింది. కేవలం రెండు స్థానాల్లో మాత్రమే సెకండ్ ప్లేస్‌లో నిలిచింది. ఎన్నడూ లేని విధంగా చితికిలపడిపోయింది.



**తొలిసారి పార్లమెంట్‌కు దూరం**

ఆ పార్టీ స్థాపించి ఇన్ని ఏళ్లు గడుస్తున్న తొలిసారి ఒక్క సీటు కూడా గెలుచుకోవడం ఇదే మొదటిసారి. 2001లో టీఆర్ఎస్‌గా స్థాపించిన తర్వాత 2004లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కేసీఆర్ కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచారు. తర్వాత 2009 లోక్ సభ ఎన్నికల్లో మహబూబ్ నగర్ నుంచి కేసీఆర్, మెదక్ నుంచి విజయశాంతి టీఆర్ఎస్ నుంచి ఎంపీలుగా గెలిచి పార్లమెంట్‌లోకి అడుగుపెట్టారు. తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో 11 లోక్ స్థానాలను గెలుచుకుంది. 2019 లోనూ టీఆర్ఎస్ 9 స్థానాలను గెలుచుకుని పూర్తి అధిపత్యం కొనసాగించింది. 2024 జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేకుండా పోతుంది. దీంతో బీఆర్ఎస్ పార్టీ చరిత్రలోనే తొలిసారి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని కోల్పోతుంది.

**సవాల్‌గా స్థానిక సంస్థల ఎన్నికలు**

లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాకపోవడంతో గులాబీ పార్టీ క్యాడర్‌లో అందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సవాల్‌గా మారనుంది. పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఆ ఎన్నికలను ఏ విధంగా ఎదుర్కోవాలి అనే టెన్షన్ కూడా మొదలైంది. లోక్‌సభ ఫలితాల్లో కాంగ్రెస్, బీజేపీ అధిపత్యం కొనసాగించాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పక తప్పదు.

# ఏపీలో చంద్రోదయం

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు అన్ని జిల్లాల్లోనూ టీడీపీ జెండా ఎగిరింది. ఏకంగా 8 జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేసిందంటే ఈ గెలుపు ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. టీడీపీ కూటమి ఏపీలో విజయఢంకా మోగించింది. తిరుగులేని ఆధిక్యంతో కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి సీట్లతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పటి వరకు ఏపీ చరిత్రలో ఇంత పెద్ద విజయం నమోదు కాలేదు. టీడీపీ 144 సీట్లలో పోటీ చేస్తే 135 సీట్లలో విజయం సాధించింది. జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో, అటు బీజేపీ 8 స్థానాల్లో విజయాన్ని నమోదు చేశాయి. ఈ దెబ్బతో వైసీపీ కొట్టుకుపోయింది.

**సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ దాటిన టీడీపీ..**

టీడీపీ ఈ ఎన్నికల్లో జనసేన, బీజేపీతో పొత్తులు పెట్టుకుంది. అయితే ఈ ఎన్నికల్లో టీడీపీకి సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ సీట్లు దాటాయి. 137 సీట్లలో విజయఢంకా మోగించింది టీడీపీ పార్టీ. దాంతో సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల బలాన్ని సంపాదించుకుంది. టీడీపీ నుంచి పోటీ చేసిన దాదాపు అందరు ప్రముఖులు గెలిచారు. కేవలం 7గురు మాత్రమే ఓడిపోయారంటే టీడీపీని ఈ ఎన్నికల్లో ప్రజలు ఎంతగా ఆదరించారో అర్థం చేసుకోవచ్చు.

**అన్ని స్థానాల్లో జనసేన ప్రభంజనం..**

ఈ ఎన్నికల్లో ప్రత్యేకించి జనసేన గురించే చెప్పుకోవాలి. ఎందుకంటే ఆ పార్టీ సాధించిన విక్టరీ మామూల్ది కాదు. పోటీ చేసిన 21 స్థానాల్లోనూ ఆ పార్టీ దుమ్ములేపింది. అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి తనకు ఏపీలో తిరుగులేదని దిక్కులు దద్దరిల్లేలా విజయాన్ని నమోదు చేసింది. పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిచింది అంటే ఆ పార్టీని ఏపీ ప్రజలు ఎంతగా ఆదరించారో అర్థం చేసుకోవచ్చు. మరీ ముఖ్యంగా కాపు సామాజిక వర్గం జనసేనకు గంప గుత్తగా ఓట్లేసిందని తెలుస్తోంది. ఈ విజయంతో ఆ పార్టీకి ఏపీలో కొత్త అధ్యాయం షురూ చేసింది.



**ఖాతా తెరిచిన బీజేపీ**

బీజేపీ ఈ ఎన్నికల్లో 8 స్థానాల్లో గెలవడం అంటే మామూలు విషయం కాదు. ఎందుకంటే గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీగా ముద్ర వేసుకుంది. కానీ ఈ సారి టీడీపీ, జనసేనతో పొత్తు ఆ పార్టీకి బాగా కలిసి వచ్చింది. అందుకే ఈ ఎన్నికల్లో 10 సీట్లలో పోటీ చేస్తే ఏకంగా 8 సీట్లలో గెలిచింది. ఇది ఆ పార్టీకి బాగా కలిసొచ్చే అంశంగా చెప్పుకోవాలి. రాబోయే రోజుల్లో మరింతగా పార్టీ విస్తరించేందుకు ఇది అవకాశం.

**8 జిల్లాల్లో క్లీన్ స్వీప్**

కూటమి ప్రభంజనం మామూలుగా లేదు. ఏకంగా 8 జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేసి పడేసింది. గత ఎన్నికల్లో వైసీపీ నాలుగు జిల్లాల్లో క్వీన్ స్వీప్ చేస్తే ఈ ఎన్నికల్లో కూటమి ఏకంగా అందుకు డబుల్ జిల్లాల్లో దుమ్ములేపింది. కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం, నెల్లూరు, పశ్చి గోదావరి, ప్రకాశం జిల్లాల్లో అన్ని స్థానాలను కూటమి గెలుచుకుంది. ఇక్కడ వైసీపీ సున్నా సీట్లకు పరిమితం అయింది. గత ఎన్నికల్లో విజయవాడలో వైసీపీ క్లీన్ స్వీప్ చేస్తే ఈ సారి ఒక్క సీటు కూడా రాలేదు.

**22 ఎంపీ స్థానాలు కూటమివే..**

అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు.. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కూటమి దుమ్ములేపింది. మొత్తం 25 లోక్ సభ స్థానాలు ఉండగా ఏకంగా ఎన్డీయే కూటమి 22 స్థానాల్లో విజయం సాధించింది. ఇందులో టీడీపీ 16 స్థానాల్లో గెలిస్తే.. జనసేన పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ గెలిచింది. అటు బీజేపీ 4 ఎంపీ స్థానాలు దక్కించుకుంది. వైసీపీ కేవలం మూడు స్థానాలతో సరిపెట్టుకుంది. ఎంపీ స్థానాల్లో మోడీ ఇమేజ్ బాగానే కలిసి వచ్చింది. అందుకే బీజేపీకి నాలుగు సీట్లు దక్కాయి. ఎన్డీయే కూటమిలో బీజేపీ తర్వాత అతిపెద్ద పార్టీగా ఇప్పుడు టీడీపీ అవతరించింది. కాబట్టి కేంద్రంలో చంద్రబాబు చక్రం తిప్పే అవకాశాలు ఉన్నాయి.

**కలిసొచ్చిన పొత్తులు**

టీడీపీకి ఈ ఎన్నికల్లో జనసేన, బీజేపీతో పొత్తులు బాగా కలిసి వచ్చాయి. మరీ ముఖ్యంగా జనసేనతో పొత్తు వల్ల వైసీపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా జాగ్రత్త పడ్డారు. జనసేన పోటీ చేసిన 21 స్థానాలలోనూ గెలిచింది అంటే ఆ పార్టీకి ఉన్న వేవ్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ జనసేన సొంతంగా పోటీ చేసి ఉంటే కథ వేరేలా ఉండేదేమో. అందుకే ఈ ఎన్నికల్లో చంద్రబాబు చాకచక్యంగా జనసేనతో పొత్తులు పెట్టుకుని తన గెలుపును సునాయాసం చేసుకున్నారు. పవన్ ఇమేజ్ తనకు కలిసి వచ్చేలా చేసుకున్నారు. అటు కేంద్రంలో బీజేపీకి తిరుగులేదు కాబట్టి ఆ పార్టీతో పొత్తులు పెట్టుకుని వ్యవస్థల సహకారం దక్కించుకున్నారు. ప్రధాని మోడీ ఇమేజ్ కూడా చంద్రబాబుకు ప్లస్ అయింది.

### వ్యూహాత్మక అడుగులు..

**గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఏపీ రాజధాని విషయంలో పోరాటాలు బాగా ప్రజాదరణను పెంచాయి. దాంతో పాటు కరెక్ట్ సమయానికి జనసేన, బీజేపీతో పొత్తులు పెట్టుకోవడం బలాన్ని పెంచాయి. అదే సమయంలో ఎన్నికల్లో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మీద బలంగా ప్రచారం చేయడం కూడా కలిసి వచ్చింది. దాంతో పాటు సూపర్ సిక్స్ పథకాలను ముందే ప్రకటించడం, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూటమి సక్సెస్ అయింది. మరీ ముఖ్యంగా అభివృద్ధి కావాలంటే చంద్రబాబు రావాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అవి బాగా ప్లస్ అయ్యాయి. ఏపీకి రాజధాని లేకుండా జగన్ చేశాడని ప్రజల్లో బలంగా ప్రచారం చేశారు. అవి వైసీపీ మీద వ్యతిరేకతను బాగా పెంచాయి. ఇలా వ్యూహాత్మక అడుగులతో చంద్రబాబు కూటమిని గెలిపించడంలో సక్సెస్ అయ్యారు.**

**అవమానాలు, అరెస్టులు ప్లస్**

గత ఐదేండ్లుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ను వైసీపీ నేతలు దారుణంగా అవమానించారు. ఏకంగా చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అసెంబ్లీ సాక్షిగా అవమానించడం ప్రజల్లో వైసీపీ మీద తీవ్రమైన వ్యతిరేకతను తీసుకొచ్చింది. దాంతో పాటు పవన్ కల్యాణ్ ను పదే పదే మూడు పెళ్లిళ్లు అంటూ వైసీపీ అవమానించడం కూడా సానుభూతిని పెంచింది. దాంతో పాటు చంద్రబాబును స్కిల్ స్కామ్ కేసులో అరెస్ట్ చేయడం కూడా టీడీపీ మీద సానుభూతిని పెంచింది. ఇవన్నీ వెరసి ఎన్నికల్లో కూటమి గెలుపుకు కారణం అయ్యాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com


TDP
TELUGU DESAM PARTY
దేశం గర్వించదగ్గ ఉత్తమ నాయకత్వం, క్రమశిక్షణ,
కఠోర శ్రమ, ముందుచూపు, అన్నిటినీ మించి
మానవత్వానికి, నిజాయితీకి నిలువెత్తు రూపం,
5 కోట్ల ఆంధ్రుల ఆరాధ్య దైవం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి
తెలుగు దేశం పార్టీ అధినేత
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
హార్ధిక
శుభాకాంక్షలు
GUDAPATI FOUNDATION
గూడపాటి శరత్
చైర్మన్ - గూడపాటి ఫౌండేషన్